ఉక్కును సెయిల్‌లో కలిపే ప్రతిపాదన లేదు : కేంద్ర మంత్రి

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్-విశాఖ ఉక్కు)ను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో విలీనం చేసే ప్రతిపాదన ఏదీలేదని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ స్పష్టంచేశారు. మంగళవారం సమాజ్ వాదీ పార్టీకి చెందిన ఎంపీ ఆదిత్య యాదవ్ ఈ అంశంపై పార్లమెంటులో ప్రశ్నించారు. ఆర్ఐఎన్ఎల్‌కు ఆర్థిక, ఆపరేషనల్ సమస్యలు ఉన్నందున సెయిల్‌లో విలీనం చేస్తారా?...అని అడగ్గా, అలాంటిదేమీ లేదని చెబుతూ, ఇప్పటికే రూ.11,440 కోట్ల ఆర్థిక సాయం చేశామని, అదే తరహా సహాయం కొనసాగుతుందని మంత్రి పేర్కొన్నారు.

వైద్యుల కొరత

ఆంధ్ర మెడికల్ కళాశాలలో భారీగా పోస్టులు ఖాళీ



- 18 ప్రొఫెసర్, 8 అసోసియేట్, 28 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీ
- రోగులకు సక్రమంగా అందని సేవలు
- పీజీ సీట్లపైనా ప్రభావం
- ఉన్నతాధికారుల దృష్టికి సమస్య

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలోని పలు కీలక విభాగాల్లో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భారీగా ఖాళీగా ఉండడంతో వైద్య సేవలపై ప్రభావం పడుతోంది. ఈ మూడు కేటగిరీలకు చెందిన వైద్యులు కేజీహెచ్‌తో పాటు ఘోషా, కంటి ఆస్పత్రి, చెవి, ముక్కు, టీబీ, మానసిక వైద్యశాలలో రోగులకు సేవలందించడంతోపాటు ఏఎంసీలో విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సి ఉంటుంది.

ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలోని 12 సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో 16 (ఒకటి కేజీహెచ్‌కు మంజూరైన పోస్టు) ప్రొఫెసర్ పోస్టులకుగాను ప్రస్తుతం 11 మంది మాత్రమే ఉన్నారు. ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కార్డియాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, మెడికల్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీల్లో ఒక్కొక్క పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఐదు కీలక సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ప్రొఫెసర్ పోస్టులు ఖాళీ కావడంతో పీజీ సీట్లపై ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదే విషయాన్ని ఆంధ్ర మెడికల్ కళాశాల అధికారులు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే మెడికల్ కాలేజీ పరిధిలో మరో 18 స్పెషాలిటీ విభాగాలు ఉన్నాయి. ఇందులో 54 (రెండు కేజీహెచ్‌కు మంజూరైన పోస్టులు) ప్రొఫెసర్ పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 43 మంది మాత్రమే ఉన్నారు. మరో 11 ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డెర్మటాలజీ విభాగంలో ఒకటి, గైనకాలజీ విభాగంలో మూడు, ఆప్తమాలజీలో రెండు, ఆర్థో విభాగంలో రెండు, సైకియాట్రీ విభాగంలో ఒకటి, ఛాతీ, అంటువ్యాధుల విభాగంలో ఒకటి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్‌లో ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయి. అలాగే సూపర్ స్పెషాలిటీ అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించి 14 (ఒకటి కేజీహెచ్) పోస్టులకుగాను 12 మంది పనిచేస్తున్నారు. రెండు ఖాళీలు ఉన్నాయి. అలాగే, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు విషయానికి వస్తే 47 మంజూరు కాగా, ప్రస్తుతం ఐదు ఖాళీ ఉన్నాయి. డెర్మటాలజీలో ఒకటి, గైనిక్‌లో ఒకటి, సైకియాట్రీలో ఒకటి, ఛాతీ, అంటువ్యాధుల్లో ఒకటి, హాస్పిటల్ అడ్మిని స్ట్రేషన్‌లో ఒకటి ఖాళీలు ఉన్నాయి.

సూపర్ స్పెషాలిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 38 (ఏడు కేజీహెచ్‌కు మంజూరైనవి) మంజూరు కాగా, 31 మంది పని చేస్తున్నారు. ఏడు పోస్టులు ఖాళీ ఉన్నాయి. కార్డియో థొరాసిక్‌లో మూడు, న్యూరోసర్జరీలో ఒకటి, పీడియాట్రిక్ సర్జరీలో ఒకటి, యూరాలజీలో ఒకటి చొప్పున ఖాళీలు ఏర్పడ్డాయి. అలాగే, స్పెషాలిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు కూడా భారీగానే ఖాళీలు ఉన్నాయి. మొత్తం 168 (ఇందులో కేజీహెచ్‌కు మంజూరైనవి 18) పోస్టులు కాగా, వీటిలో 15 పోస్టులు ఖాళీ ఉన్నాయి. డెర్మటాలజీలో మూడు, గైనిక్‌లో రెండు, ఆప్తమాలజీలో మూడు, ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఒకటి, న్యూక్లియర్ మెడిసిన్‌లో ఒకటి చొప్పున ఖాళీలు ఉన్నాయి.

ఇదీ లెక్క...

ఆంధ్ర మెడికల్ కాలేజీ, కేజీహెచ్ పరిధిలో నాన్ క్లినికల్, క్లినికల్, సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో కలిపి 86 ప్రొఫెసర్ పోస్టులకుగాను ప్రస్తుతం 58మంది పని చేస్తుండగా, 18 ఖాళీలు ఉన్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 83 మంజూరుకాగా, ప్రస్తుతం 75 మంది పని చేస్తున్నారు. ఎనిమిది ... మిగతా 6వ పేజీలో

స్టాండింగ్ కమిటీకి 21 నామినేషన్లు

- టీడీపీ నుంచి తొమ్మిది, బీజేపీ నుంచి ఒకటి...
- వైసీపీ నుంచి పది
- జనసేన నుంచి ఒకటి
- పార్టీ అంగీకారం లేకుండా సాదిక్ నామినేషన్
- నేడు నామినేషన్ల పరిశీలన



అదనపు కార్యదర్శి ఎస్ఎస్‌వర్మకు నామినేషన్ అందజేస్తున్న మొల్లి హేమలత, ఇతర కార్పొరేటర్లు

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి):
జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీకి 21 మంది కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. వచ్చే నెల ఆరున జరిగే ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్ల దాఖలుకు గడువు మంగళవారంతో ముగిసింది. స్టాండింగ్ కమిటీలో పది స్థానాలకు సభ్యులను ఎన్నుకునేందుకు కమిషనర్ ... మిగతా 6వ పేజీలో

నామినేషన్ వేసిన అభ్యర్థులు...
(బ్రాకెట్‌లో వార్డు, పార్టీ)

1. గంకల కవిత (48, బీజేపీ), 2. మహ్మద్ సాదిక్ (39, ఇండిపెండెంట్...జనసేనకు మద్దతు), 3. దాడి వెంకట రామేశ్వరరావు (89, టీడీపీ), 4. సేనాపతి వసంత (97, టీడీపీ), 5.మొల్లి హేమలత (5, టీడీపీ), 6. మాదంశెట్టి చినతల్లి (84, టీడీపీ), 7. గేదెల లావణ్య (17, టీడీపీ), 8. రాపర్తి త్రివేణివరప్రసాద రావు (93, టీడీపీ), 9.రౌతు శ్రీనివాసరావు (79, టీడీపీ), 10.మొల్లి ముత్యాలు (88, టీడీపీ), 11. కొణతాల నీలిమ (80, టీడీపీ), 12. నక్కెళ్ల లక్ష్మి (20, వైసీపీ), 13. సాది పద్మారెడ్డి (24, వైసీపీ) 14. పల్లా అప్పల కొండ (28, వైసీపీ) 15. బిపిన్‌కుమార్‌జైన్ (31, వైసీపీ) 16. గుండపు నాగేశ్వరరావు (40, వైసీపీ), 17. కోడిగుడ్ల పూర్ణిమ (41, వైసీపీ), 18.రెయ్యి వెంకటరమణ (51, వైసీపీ), 19. కేవీఎన్ శశికళ (55, వైసీపీ), 20. మహ్మద్ ఇమ్రాన్ (66 వైసీపీ), 21. ఉరుకూటి రామచంద్రరావు (70, వైసీపీ)

చదవడం, రాయడం రావడం లేదు

ఆరో తరగతి విద్యార్థుల్లో 60 శాతం మందికి కనీస ప్రమాణాలు కరవు

- ప్రాథమిక పాఠశాల స్థాయిలో బోధన పటిష్ఠంగా లేకపోవడమే కారణం
- విద్యా శాఖ అప్రమత్తం
- ఈ ఏడాది ఆరో తరగతిలో చేరిన విద్యార్థులకు 'సంసిద్ధత' కార్యక్రమం



ఆరోతరగతి విద్యార్థులకు బోధన చేస్తున్న టీచర్లు

- ఒకటి నుంచి ఐదు తరగతుల పునశ్చరణ
- వచ్చే నెల నాలుగో తేదీ నుంచి పరీక్షలు

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి):

'ఉన్నత పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు కనీసం చదవడం, రాయడం రావడం లేదు. వారు చదివే తరగతి కాదు, కనీసం కింది తరగతుల పుస్తకాలు చదివి కూడా వివరించలేకపోతున్నారు. ఈ విధానం వల్ల విద్యార్థుల భవిష్యత్తులో నష్టపోతారు.'..

- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ఆందోళన.

ఆరో తరగతి విద్యార్థుల్లో కనీస విద్యా ప్రమాణాలు కొరవడ్డాయి. వారికి తగినంత సామర్థ్యం లేదని 'అసర్' (యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు) వెల్లడించింది. ఈ సర్వే మేరకు ఆరో తరగతిలోకి వచ్చే 60 శాతం మంది విద్యార్థులకు కనీస సామర్థ్యాలు లేవు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో ఈ సమస్య ఎక్కువ ఉందని సర్వే గుర్తించింది. ప్రాథమిక స్థాయిలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ పటిష్ఠమైన బోధన అందడం లేదనే వాదన వినిపిస్తోంది. ఉన్నత పాఠశాలలతో పోల్చితే ఎలిమెంటరీ పాఠశాలల్లో బోధనా ప్రమాణాలు తక్కువగా ఉంటున్నాయంటున్నారు. గ్రామాలు, నగరాల్లో స్థోమత ఉన్న కుటుంబాలు పిల్లలను ఒకటో తరగతి నుంచే ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నాయి. పేద వర్గాల పిల్లలు ప్రభుత్వ బడులకు వస్తున్నారు. వారిలో విద్యపై అవగాహన ఉన్న తల్లిదండ్రులు సాయంత్రం ఇంటికి వచ్చిన తరువాత పిల్లలను కూర్చోబెట్టి చదివిస్తుంటారు. లేనివారైతే పాఠశాలల్లో చెప్పిన పాఠాలకే పరిమితమవుతున్నారు.

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో మరింత సమస్య

జిల్లాలోని అనేక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కేవలం పది మంది విద్యార్థులు మాత్రమే ఉండడంతో ఒక్కరే టీచర్ ఉంటున్నారు. ఒక టీచరు ఉన్నచోట విద్యార్థుల్లో సామర్థ్యం ఉండడం లేదు. దీనికితోడు టీచర్లు కొందరు పాఠశాలకు వెళ్లామా.. వచ్చామా అన్నట్టుగా పనిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఏడాదికి 75 శాతం హాజరుశాతం ఉంటే పైతరగతికి ప్రమోట్ చేస్తుండడంతో ప్రాథమిక పాఠశాలల స్థాయిలో విద్యా ప్రమాణాలను పట్టించుకోవడం లేదు. ఐదు నుంచి ఆరో తరగతికి ప్రమోట్ చేస్తే తమ పని అయిపోయినట్టు టీచర్లు భావిస్తుండడంతో ఈ పరిస్థితి తలెత్తుతోందని ... మిగతా 6వ పేజీలో



ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనసేన కార్పొరేటర్లు

జనసేన కార్పొరేటర్లలో లుకలుకలు

- ఫ్లోర్ లీడర్‌ను మార్చాలంటూ ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఫిర్యాదు
- డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేయాలని మరికొందరు యోచన

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి):
జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల వేళ జనసేనకు చెందిన కార్పొరేటర్లలో విభేదాలు తలెత్తాయి. జనసేన పార్టీ తరఫున పోటీ చేసి ముగ్గురు గెలుపొందారు. అయితే ఇండిపెండెంట్‌లుగా గెలిచిన ఇద్దరు, వైసీపీ నుంచి గెలిచిన మరో తొమ్మిది మంది కార్పొరేటర్లు ఇటీవల జనసేనలో చేరారు. దీంతో ప్రస్తుతం జనసేన కార్పొరేటర్ల సంఖ్య 14కి పెరిగింది. త్వరలో జరగనున్న స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణశ్రీనివాస్ సమక్షంలో కార్పొరేటర్లు నిర్ణయించారు. అయితే మంగళవారం ... మిగతా 6వ పేజీలో

దేవుడి పేరిట వ్యాపారం!

తాత్కాలికంగా ఏర్పాటుచేసే విగ్రహాల దర్శనానికి, పూజలకు టికెట్లు

ఎడాపెడా హుండీల ఏర్పాటు

- ప్రాంగణాల్లో దుకాణాల ఏర్పాటుకు అడ్వాన్స్‌లు, అద్దెలు
- బీచ్‌రోడ్డు సమీపాన 'లులూ మాల్‌కు కేటాయించిన ఏపీఐఐసీ స్థలంలో వినాయక మహోత్సవం నిర్వహణకు పెదగంట్యాడ యువకుడు దరఖాస్తు



బీచ్‌రోడ్డు సమీపంలోని ఏపీఐఐసీ స్థలం

- ఇద్దరు నేతల సిఫారసు
- ఇంకా అనుమతులు ఇవ్వక ముందే నేడు కర్రపూజ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్నట్టు... విశాఖపట్నంలో దేవుడి బొమ్మలు పెట్టి వ్యాపారం చేసేవారు ఎక్కువయ్యారు. ఇటీవల బీచ్‌రోడ్డులో పార్క్ హోటల్ సమీపాన అయోధ్య రామాలయం సెట్ వేసి, బాలరాముడి విగ్రహం చూడడానికి రూ.50 టిక్కెట్ పెట్టి కొందరు కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. సీతారాముల కల్యాణోత్సవం పేరుతో మరో దోపిడీకి తెర తీయగా అది బెడిసి కొట్టింది. 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు రావడంతో నిర్వాహకులు దానిని మూసేశారు. ఇప్పుడు వినాయ చవితి సీజన్ వచ్చింది. ఆగస్టు 27న వినాయ చవితి. ఎప్పటిలాగే గాజువాకలో భారీ వినాయక విగ్రహాలు పెట్టి వ్యాపారం చేసుకోవడానికి శ్రీకారం చుట్టేశారు.

అక్కడ లంకా గ్రౌండ్‌లో లక్ష చీరలతో వినాయకుడి విగ్రహం ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. అలాగే గాజువాక ఆర్టీసీ బస్ డిపో వద్ద మరో భారీ విగ్రహం రూపుదిద్దుకుంటోంది. ఇక అక్కడ ఇంకో భారీ విగ్రహం పెడితే జనాలు పెద్దగా రారని భావించిన పెదగంట్యాడకు చెందిన ఓ యువకుడు విశాఖ నగరంలో దుకాణం తెరుస్తున్నాడు. బీచ్ రోడ్డు సమీపాన గల ఏపీఐఐసీకి చెందిన 13.43 ఎకరాల స్థలంలో 'వరసిద్ధి వినాయక మహోత్సవం' నిర్వహించాలని నిర్ణయించారు. దీనికి బుధవారం కర్రపూజ చేస్తామని, అంతా తరలి రావాలని సోషల్ ... మిగతా 6వ పేజీలో

31న షిప్‌యార్డు సీఎండీ హేమంత్ ఖత్రీ పదవీ విరమణ



షిప్‌యార్డు సీఎండీ హేమంత్ ఖత్రీ

మల్కాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి):
షిప్‌యార్డు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) హేమంత్ ఖత్రీ ఈనెల 31వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. 2020 సెప్టెంబరు ఒకటో తేదీన సీఎండీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. అనేక సవాళ్లను ఎదుర్కొంటూ షిప్‌యార్డుకు భారీ ఆర్డర్‌లను తీసుకువచ్చారు. నౌకా నిర్మాణ రంగంలో షిప్‌యార్డుకు పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారు. ఆయన పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో సీఎండీ పదవి కోసం అనేకమంది పోటీపడుతున్నారు. ప్రస్తుతం సంస్థ డైరెక్టర్‌లుగా ఉన్నవారితోపాటు బయట వ్యక్తులు కూడా సీఎండీ పోస్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ కాగానే ఆటో మ్యుటేషన్



మధురవాడ కార్యాలయంలో అవగాహన కల్పిస్తున్న డీఐజీ బాలకృష్ణ

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి):
జీవీఎంసీ పరిధిలో ఎవరు ఫ్లాటు, ఇల్లు కొనుగోలు చేసినా వాటి రిజిస్ట్రేషన్ సమయంలోనే రికార్డుల్లో ఆటోమ్యుటేషన్ జరిగిపోయేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దీనిపై రిజిస్ట్రేషన్ల శాఖ కసరత్తు చేస్తోంది. ఆగస్టు ఒకటి నుంచి ఇది అమలు కానున్నది. దీనిపై మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం డాక్యుమెంట్ రైటర్లకు రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ బాలకృష్ణ అవగాహన కల్పించారు.ఖాళీ స్థలం/ఇల్లు/ఫ్లాట్ జీవీఎంసీ పరిధిలో కొంటే...సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే మ్యుటేషన్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తికాగానే అదే సమాచారం జీవీఎంసీకి వెళుతుందని, అక్కడ ప్రత్యేకంగా దరఖాస్తు చేయకుండానే ఆటో మ్యుటేషన్ జరిగిపోతుందన్నారు. కొనుగోలుదారుల పేర్లు రికార్డులో అప్‌డేట్ అవుతాయని సబ్ రిజిస్ట్రార్ చక్రపాణి వివరించారు. పారదర్శకత పెరుగుతుందన్నారు.

ఫెర్టిలిటీ సెంటర్లపై ఆరోగ్య శాఖ కన్ను

- 'సృష్టి' వ్యవహారంతో అప్రమత్తమైన అధికారులు
- నిరంతరం తనిఖీలు నిర్వహించాలని నిర్ణయం
- మూడు కేంద్రాలను స్వయంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



ఒయాసిస్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఆరోగ్యశాఖ అధికారి

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి):
తెలుగు రాష్ట్రాల్లో 'సృష్టి' వ్యవహారం వెలుగులోకి వచ్చిన తరువాత ఫెర్టిలిటీ సెంటర్లపై వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేకంగా దృష్టిసారించింది. 'సృష్టి' మూలాలు నగరంలో కూడా ఉన్నట్టు ఇప్పటికే నిర్ధారణ అయ్యింది. ఇక్కడ తనిఖీలు చేసిన పోలీసులు కొన్ని ఆధారాలను సేకరించడంతోపాటు మేనేజర్‌గా పనిచేస్తున్న మహిళను అరెస్టు చేశారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ 2018లో అనుమతి తీసుకుంది. 2023 నుంచి రెన్యువల్ చేయించుకోలేదు. అయినప్పటికీ ఇక్కడ అనధికారికంగా కార్యకలాపాలు నిర్వహించినట్టు హైదరాబాద్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో తేలింది. ఈ నేపథ్యంలో ఐవీఎఫ్, సరోగసీ సెంటర్లలో జరుగుతున్న కార్యకలాపాలపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టాలని అధికారులు నిర్ణయించారు. జిల్లాలో ఉన్న 50 ఫెర్టిలిటీ సెంటర్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని అధికారులకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. ఈ బాధ్యతలను 'డెమో' నాగేశ్వరరావు, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్‌కు అప్పగించారు. వీరిద్దరితో కూడిన అధికారుల బృందం ఆయా కేంద్రాలను తనిఖీలు చేయనున్నది. వారంలో ఒకటి, రెండుసార్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కూడా స్వయంగా కొన్ని కేంద్రాలను తనిఖీ చేయాలని నిర్ణయించారు. మంగళవారం జిల్లాలోని ... మిగతా 6వ పేజీలో



బంకర్‌లో మ్యూజియం

ఆకట్టుకునే హెచ్ఎస్ఎల్ బంకర్





మల్కాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం హిందూస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్)లో ఉన్న బంకర్ మ్యూజియం విశేషంగా ఆకట్టుకుంటుంది. 1941లో షిప్‌యార్డులో నౌకా నిర్మాణ పనులు మొదలైనప్పటికీ 1939లోనే ఈ బంకర్‌ను ఏర్పాటుచేశారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో మన సైనికులు తలదాచుకునేందుకు ఈ బంకర్ ఉపయోగపడినట్టు షిప్‌యార్డు అధికారులు చెబుతుంటారు. బంకర్‌లో ఏర్పాటుచేసిన మ్యూజియంలో షిప్‌యార్డుకు సంబంధించిన విషయాలతో పాటు నాడు రెండో ప్రపంచ యుద్ధంలో చోటుచేసుకున్న సంఘటనలకు సంబంధించిన చిత్రాలను, నాడు వినియోగించిన సిగ్నల్ లైట్, మాగ్నెట్ కంపాస్, బారోమీటర్ వంటి వాటిని ప్రదర్శనకు ఉంచారు. బంకర్‌లోపల సబ్‌మెరైన్ లోపల భాగం ఎలా ఉంటుందో అలాగే ఉంది.

భీమిలి జోన్ అభివృద్ధికి పటిష్ఠ చర్యలు

» ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం

» తీరం కోత నివారణకు రక్షణ గోడ నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళిక

భీమునిపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పురాతన చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్న భీమిలి జోన్‌ను అంచెలంచెలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం జోనల్ కార్యాలయంలో ఆయన వార్డు కార్పొరేటర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిలి అభివృద్ధి కార్యాచరణపై జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కమిషనర్‌కు వివరించారు. అనంతరం కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ జోన్‌లో ఉన్న నాలుగు వార్డుల్లో ప్రజలకు కల్పించే మౌలిక సదుపాయాలలో ప్రధానంగా కాలువలు, రహదారులు, భూగర్భ విద్యుత్తు తదితర పనులు నిర్వహించేటపుడు భూగర్భ డ్రైనేజీ, భూగర్భ విద్యుత్తు లైన్లు, సెంటర్ మీడియన్ పనులు మిళితమై ఉండేటట్లు సంబంధిత విభాగాల అధికారులతో సంప్రతించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తే ఆయా పనులు పరిపూర్ణంగా ఉంటాయన్నారు.

ఈ సందర్భంగా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మత్స్యకార సంఘం సభ్యులు ఆయనను కలిశారు. బీచ్‌రోడ్డు కోతకు గురవడంతో తమ కుటుంబాలు భయాందోళనలకు గురవుతున్నాయని తెలిపారు. సందర్శకులు, యాత్రికులు, పర్యాటకులు బీచ్‌కు వస్తున్నందున సుందరంగా తీర్చిదిద్దాలని, ప్రమాదాలు జరగకుండా బీచ్‌లో లైఫ్‌గార్డులను ఏర్పాటు చేయాలని కమిషనర్ కేతన్ గార్గ్‌ను కోరారు. ఈ పర్యటనలో జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వెంకటేష్, వాసు శ్రీధర్, సుధాకర్, అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



భీమిలి జోన్ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనరు కేతన్ గార్గ్ పాల్గొన్న జోనల్ అధికారులు

బీచ్‌రోడ్డు కోతకు గురిగాకుండా రక్షణ గోడ..

భీమిలి సముద్రతీరం కోతకు గురి గాకుండా పటిష్ఠ రక్షణ చర్యలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనరు కేతన్ గార్గ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణాన్ని సందర్శించిన జీవీఎంసీ కమిసనర్ బీచ్‌రోడ్డులో కోతకు గురవుతున్న పోలమాంబ ఆలయం నుంచి బోయవీధి, నోవాటెల్, లైట్‌హౌస్ మీదుగా సముద్రం గెస్ట్‌హౌస్‌వరకూ ఆయన కాలినడకన పర్యటించి కోతకు గురవుతున్న తీరాన్ని పరిశీలించారు. భీమిలి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, పర్యవేక్షక ఇంజనీరు వై.కృష్ణారావులతో చర్చించి భవిష్యత్‌లో ఎటువంటిప్రకృతి వైపరీత్యాలు,తుపానులు, సునామీలు వచ్చినా బీచ్‌రోడ్డు ప్రజలు భయాందోళనలకు గురిగాకుండా ఉండేలా ప్రతిష్ఠ రక్షణగోడ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పోలమాంబ ఆలయం నుంచి సముద్రం గెస్ట్‌హౌస్ వరకూ సుమారు 1.09 కిలోమీటర్ల మేరకు రక్షణ గోడ నిర్మానానికిఅర్బన్ ఫ్లడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం (యూఎఫ్‌ఆర్‌ఎంటీ) నిధులను ఈ నిర్మాణానికి విడుదల చేయాలని ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు.

'ఆటోడ్రైవర్లకు'వాహనమిత్ర' అమలు చేయాలి'

తగరపువలస, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వాహనమిత్ర పథకాన్ని అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవిందరావు కోరారు. మంగళవారం తగరపువలసలో అంబేడ్కర్ కూడలి నుంచి ఆటో డ్రైవర్లు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో గోవిందరావు మాట్లాడుతూఆటో మోటారు వాహన డ్రైవర్లకు ఈ పథకం ద్వారా రూ.15 వేలు చెల్లించాలని కోరారు.

స్టాండింగ్ కమిటీకి 21 నామినేషన్లు

... 5వ పేజీ తరువాయి

కేతన్‌గార్గ్ ఈనెల 21న నోటిఫికేషన్ జారీచేశారు. వైసీపీ నుంచి పది మంది కార్పొరేటర్లు ఈనెల 26న నామినేషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సీట్లు పంపకాలు తేలకపోవడంతో మంగళవారం మధ్యాహ్నం వరకూ పోటీకి దిగే అభ్యర్థులను ఎంపిక చేయలేకపోయారు. చివరకు జనసేన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీకి దిగడం లేదని స్పష్టం చేయడంతో, బీజేపీకి ఒక సీటు కేటాయించి మిగిలిన తొమ్మిది సీట్లకు టీడీపీ కార్పొరేటర్లను పోటీకి నిలపాలని నిర్ణయించారు. అయితే 39వ వార్డు నుంచి ఇండిపెండెంట్‌గా గెలిచి వైసీపీలో చేరి, ప్రస్తుతం జనసేనలో చేరిన మహ్మద్ సాదిక్ మంగళవారం ఉదయాన్నేనామినేషన్ దాఖలు చేయడం కూటమి పార్టీల్లో చర్చనీయాంశంగా మారింది.

పార్టీ జిల్లా అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం కార్పొరేటర్లంతా సమావేశమై పోటీకి దూరంగా ఉండాలనే అభిప్రాయానికి వచ్చామని, కానీ సాదిక్ మాత్రం పార్టీ అనుమతి లేకుండానే నామినేషన్ దాఖలు చేశారని ఆ పార్టీకి చెందిన కొందరు కార్పొరేటర్లు చెబుతున్నారు. రెండో తేదీ వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ఉండడంతో సాదిక్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకునే అవకాశం ఉందని టీడీపీ కార్పొరేటర్లు అభిప్రాయపడుతున్నారు.

చదవడం, రాయడం రావడం లేదు

... 5వ పేజీ తరువాయి

విద్యావేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'సంసిద్ధత' అమలు

ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యా శాఖ అప్రమత్తమైంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో చేరిన విద్యార్థులకు సంసిద్ధత (రెడీనెస్) కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభమైన తరువాత 'సంసిద్ధత' కార్యక్రమం పేరిట లాంగ్వేజస్, నాన్ లాంగ్వేజస్ పుస్తకాలు అందజేశారు. గత నెల నుంచి ఇప్పటివరకూ (40 రోజులపాటు) ప్రతిరోజు ఆరో తరగతి విద్యార్థులకు సంసిద్ధత పుస్తకాలపైనే బోధన చేస్తున్నారు. విశాఖ జిల్లాలో 112 యూపీ, ఉన్నత పాఠశాలల్లో సుమారు పది వేల మంది పిల్లలు ఆరో తరగతిలో చేరారు. తరగతిలో ప్రవేశం పొందిన రోజు నుంచి ఇప్పటివరకూ ఆరో తరగతి సిలబస్ బోధన చేయడం లేదు. దాని స్థానంలో ప్రభుత్వం ముద్రించిన సంసిద్ధత కార్యక్రమం పుస్తకాల్లో పాఠాలు చెబుతున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సిలబస్ మేరకు ఈ పుస్తకాలు రూపొందించారు. జిల్లాలో ఆరో తరగతిలో సుమారు 60శాతం విద్యార్థులు సామర్థ్యం కంటే తక్కువలో ఉన్నారనే విషయం గుర్తించారు. తెలుగులో వర్ణమాల, ఇంగ్లీష్‌లో ఏ.బీ.సీ.డీ నుంచి పదాలు వరకు, గణితంలో ఎక్కాలు నుంచి కూడికలు, తీసివేతలు, చిన్నపాటి లెక్కలు బోధిస్తున్నారు. సంసిద్ధత పుస్తకాలపై పట్టు వచ్చేలా టీచర్లకు షెడ్యూల్ ఇచ్చారు. 40 రోజుల బోధన తరువాత వచ్చే నెల 4 నుంచి ఆరో తేదీ వరకు ఆరో తరగతి విద్యార్థులకు సంసిద్ధత పుస్తకాలపైనే మాత్రమే పరీక్షలు (ఎఫ్‌ఏ-1) నిర్వహించనున్నారు.ఈ పరీక్షలుముగిసిన తరువాతే ఆరో తరగతి సిలబస్ బోధనచేస్తారు.

వైద్యుల కొరత

... 5వ పేజీ తరువాయి

పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసిస్టెంట్ ప్రొఫె సర్ పోస్టులు 280 మంజూరు కాగా, ప్రస్తుతం 252 మంది పనిచేస్తున్నారు. మరో 28 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవన్నీ, పదేళ్ల కిందట మంజూరైన పోస్టులు. పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులను పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. కీలక విభాగాల్లో యూనిట్ల సంఖ్యను పెంచాల్సి ఉందని, యూనిట్లు పెరిగితే ప్రొఫెసర్, ఇతర కేడర్ పోస్టులు పెరుగుతాయని నిపుణులు చెబు తున్నారు.

పదోన్నతుల కోసం నిరీక్షణ

అసోసియేట్ ప్రొఫెసర్ నుంచి ప్రొఫెసర్ పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న వైద్యుల సంఖ్య భారీగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 250 మందికిపైగా ఎదురుచూస్తుంటే, ఉత్తరాంధ్రలో సుమారు 70 మందికిపైగా ప్రొఫెసర్ పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రమోషన్స్ ఇచ్చేందుకు ఇప్పటికే ప్రభుత్వం సిద్ధమైంది. కౌన్సిలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే, ఇందులో ఎంత మందికి అవకాశం దక్కుతుందో చూడాల్సి ఉంది. సాధారణంగా మూడేళ్లపాటు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేసినవాళ్లు ప్రొఫెసర్ పదోన్నతికి అర్హులు. కానీ, ప్రస్తుతం వన్‌టైమ్ ప్రమోషన్ కోసం ఏడాది సీనియారిటీ ఉన్న వారిని కూడా కౌన్సెలింగ్‌కు పిలుస్తున్నట్టు చెబుతున్నారు. పదేళ్ల నుంచి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న ఎంతో మంది తమకు చివరి దశలో అయినా ప్రొఫెసర్‌గా పదోన్నతి లభిస్తుందా.? లేదా.? అన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.

దేవుడి పేరిట వ్యాపారం!

... 5వ పేజీ తరువాయి

మీడియాలో ఆహ్వాన పత్రికను తెగ వైరల్ చేస్తున్నారు.

అనుమతులు ఇంకా ఇవ్వలేదు

బీచ్‌రోడ్డులో హార్బర్ పార్క్ ఏరియాలోని ఏపీఐఐసీకి చెందిన ఆ 13.43 ఎకరాల స్థలాన్ని ఇటీవలె రాష్ట్ర ప్రభుత్వం లులూ మాల్‌కు కేటాయించింది. భారీ షాపింగ్‌మాల్ నిర్మాణానికి 99 ఏళ్లకు లీజుకు ఇచ్చింది. అయితే 'యూత్ ఐకాన్' పేరుతో ఆహ్వాన పత్రిక ముద్రించిన సదరు యువకుడు వినాయ చవితి ఉత్సవాలకు ఆ భూమిని కేటాయించాలని ఏపీఐఐసీ అధికారులకు దరఖాస్తు చేశాడు. నగరంలోని ఇద్దరు ఎమ్మెల్యేలతో సిఫారసు కూడా చేయించాడు. ఇద్దరు సిఫారసు చేయడంతో ఏపీఐఐసీ అధికారులు అనుమతి ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది. వినాయక చవితి ఇంకా నెల రోజులు ఉంది కాబట్టి దరఖాస్తును పరిశీలనలో పెట్టారు. వచ్చిన వ్యక్తికి పరిస్థితిని కూడా వివరించారు. ఆ భూమిని లులూ మాల్‌కు ఇచ్చేశారని, ఆ సంస్థకు చెందిన ప్రతినిధులు ఎవరైనా వస్తే తక్షణమే ఖాళీ చేయాల్సి ఉంటుందని చెప్పారు. అవన్నీ తాను చూసుకుంటానని దరఖాస్తుదారుడు బదులిచ్చాడు. అధికారులు ఇంకా అనుమతులు ఇవ్వక ముందే అందులో కర్రపూజను బుధవారం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

పెదగంట్యాడ నుంచి వచ్చి చేయాల్సిన అవసరం ఏమిటి?

వినాయక చవితి ఉత్సవాలు వీధివీధినా చేస్తారు. అతను పెదగంట్యాడ నుంచి విశాఖపట్నం వచ్చి 13.43 ఎకరాల విస్తీర్ణంలో నిర్వహించాల్సిన అవసరం ఏమిటి?, దీనికి అవసరమైన నిధులు ఎక్కడ నుంచి తెస్తారు?...అనేది ఆలోచిస్తే...ఉత్సవం వెనుక మతలబు అర్థమవుతుంది. దేశమంతా వినాయక చవితిని నవరాత్రులు అంటే తొమ్మిది రోజులు నిర్వహిస్తే గాజువాక ముఠాలు మాత్రం నెల రోజులు చేస్తున్నాయి. కొన్నేళ్లుగా అదే జరుగుతోంది. వినాయక చవితి అని పెద్ద మైదానంలో భారీ విగ్రహం పెట్టి, దానిని చూడడానికి, పూజలకు వేర్వేరుగా టికెట్లు, దక్షిణకు హుండీలు పెట్టి దండుకోవడం అలవాటుగా మారింది. అక్కడితో ఆగకుండా ఆ ప్రాంగణంలో జాతరలా పలు రకాల వ్యాపారాలు నిర్వహించుకోవడానికి దుకాణాలు, జెయింట్ వీల్ వంటివి పెట్టి, వారి నుంచి లక్షల రూపాయల్లో అడ్వాన్సులు, అద్దెలు వసూలు చేస్తున్నారు.

అధికారులు ఆలోచించాలి?

వ్యాపార ధోరణితో ఉత్సవాలు చేసే వారికి అనుమతులు ఇచ్చే ముందు అధికారులు బాగా ఆలోచించాలి. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎవరైనా సరే వినాయక ఉత్సవాలు తొమ్మిది రోజులతో ముగించాలని స్పష్టంచేయాలి. ఆయా ప్రాంగణాల్లో వ్యాపారాలు నిర్వహించకూడదనే నిబంధన పెట్టాలి. ఏదైనా ప్రమాదం జరిగితే నివారించడానికి తగిన ఏర్పాట్లు ఉండేలా చూడాలి. ముఖ్యంగా టిక్కెట్లు పెట్టి డబ్బులు వసూలు చేయకూడదని ఆంక్షలు పెట్టాలి.

నాయకులూ తస్మాత్ జాగ్రత్త

'కుర్రాళ్లు ఏదో చేసుకుంటామని ఉత్సాహ పడుతున్నారు' అని ప్రజాప్రతినిధులు వెనుకాముందు చూడకుండా సిఫారసు చేస్తున్నారు. అదే కొంప ముంచుతోంది. వారి పేర్లు చెప్పి నిర్వాహకులు నగరంలో వ్యాపారులు, పారిశ్రామికవేత్తల నుంచి భారీగా చందాలు దండేస్తున్నారు. ఎగ్జిబిషన్ పెట్టి వ్యాపారాలు చేస్తున్నారు. హిందూ పండగలను ఈవెంట్లుగా మార్చుకొని లాభపడాలని చూస్తున్నారు. ఇటువంటి వారికి దూరంగా ఉండడం, సిఫారసులు చేయకపోవడం నాయకులకు అన్నివిధాలా శ్రేయస్కరం. వద్దంటే...ఒక్కరితో పోతుంది. ఏదైనా జరిగితే నియోజకవర్గంలో పరువు పోతుంది.



బియ్యాన్ని పరిశీలిస్తున్న రవిప్రకాశ్‌రెడ్డి

అంధ బాలికల పాఠశాలను సందర్శించిన డైరెక్టర్

సాగర్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్ బీచ్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమ తదితర శాఖల డైరెక్టర్ బి.రవిప్రకాశ్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదులను, పైళ్లను, విద్యార్థిలను ఆహారానికి వినియోగిస్తున్న బియ్యం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి బోధనపై ఆరా తీశారు. పాఠశాల అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలను విరివిగా నిర్వహించేందుకు ఆహ్వానం పలకాలన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థినులకు మెరుగైన బోధన కోసం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు డి.విజయ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగదేవతకు ప్రత్యేక పూజలు



విజినిగిరిపాలెం ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

సింహాచలం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నాగపంచమిని పురస్కరించుకుని 98వ వార్డు పరిధి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నవనాగులకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేశారు. వేకువజామున అర్చకుడు ఉదయ్‌కృష్ణశర్మ శైవాగమశాస్త్ర విధానంలో ప్రభాతారాధనలు చేసి శ్రీవల్లీ దేవసన సమేత సుబ్రహ్మణ్యస్వామికి షోడశోపచారాలు సమర్పించి పంచామృతాలతో అభిషేకం చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి సుబ్రహ్మణ్య స్వామికి, నవనాగులకు పూజలు చేశారు.

సింహాచలేశునికి సంప్రదాయబద్ధంగా ఆర్జిత సేవలు

సింహాచలం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం సింహాద్రి అప్పన్న స్వామికి మంగళవారం సంప్రదాయబద్ధంగా ఆర్జిత సేవలు నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధిగా పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించాక విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించి, నృసింహ సహస్రనామావళి పఠిస్తూ తులసీ దళార్చన చేశారు. ఆ తరువాత గోవిందరాజస్వామిని గరుడ వాహనంపై అధిష్ఠింపజేసి ఉభయ దాతల గోత్రనామాలతో పూజలు జరిపారు. అనంతరం ఇదే వేదికపై సింహాచలేశుని నిత్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. మంగళవాయిద్యాల నడుమ స్వామివారి చుట్టూ భక్తులు ముమ్మార్లు ప్రదక్షిణలు చేశారు.

అప్పన్నను దర్శించుకున్న శివథాను పిళ్లై

వరాహలక్ష్మీనృసింహస్వామిని సోమవారం రాత్రి ప్రఖ్యాత అంతరిక్షశాస్త్ర పరిశోధకుడు, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండీ డాక్టర్ శివథాను పిళ్లై దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పర్యవేక్షణాధికారి జీవీవీఎస్‌కే ప్రసాద్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నాక ఆయన గోత్రనామాలతో అంతరాలయంలో పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి సన్నిధిలో పూజల తరువాత పండితులు వేదాశీర్వచనాలు, అధికారులు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.



గరుడ సేవలో భాగంగా స్వామివారికి హారతిస్తున్న అర్చకుడు

చందన సమర్పణకు రూ.లక్ష విరాళం

వరాహలక్ష్మీనృసింహస్వామికి ప్రైపూతగా ఉండే చందన సమర్పణకు గాను ఎండాడకు చెందిన ఆళ్ల వెంకట రామకృష్ణ, రంగమణి దంపతులు లక్ష రూపాయలను విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని నగదు రూపంలో మంగళవారం ఏఈఓ కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి త్రిమూర్తులకు అందజేశారు. దాత కుటుంబీకులకు అంతరాలయ దర్శన భాగ్యం కల్పించి, శేషవస్త్రాన్ని, ప్రసాదాలను, వేదాశీర్వచనాలు అందజేశారు.



దాత ఆళ్ల వెంకటరామకృష్ణకు ప్రసాదం అందజేస్తున్న ఏఈవో తిరుమలేశ్వరరావు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

జిమ్‌సర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాక్షినగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జోడుగుళ్లపాలెంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) వైద్య కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీ ఎం.శ్రీభరత్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. గైనిక్, ఈఎన్‌టీ, కీళ్ల నొప్పులు, కళ్లు, చర్మవ్యాధులు, ఫిజియోథెరపీ, డెంటల్, గుండె సంబంధిత వ్యాధుల గురించి వైద్యులు సూచనలు ఇవ్వడంతోపాటు పలువురికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో జిమ్‌సర్ డాక్టర్ కృష్ణ కార్తీక్ బోగవల్లి, వైద్య విద్యార్థులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేస్తాం

సుపరిపాలన తొలి అడుగులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



తోటవీధి నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగులో గంటా నూకరాజు

భీమునిపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలుచేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని 3వ వార్డులో గల తోటవీధిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ఏడాదిలో చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని తెలియపరుస్తూ కరపత్రాలను అందజేశారు. సూపర్ సిక్స్‌లో ఆగస్టు నెల నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుకు రంగం సిద్ధం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాసరపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ శ్రీభరత్ జన్మదిన వేడుకలు

భీమునిపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) :విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం భీమిలి జోన్-4వ వార్డులో టీడీపీ వార్డు అధ్యక్షులు పాసి నర్సింగరావు ఆధ్వర్యంలో కె.నగరపాలెం జంక్షన్‌లో టీడీపీ కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. బర్త్‌డే కేక్‌ను పాసి నర్సింగరావు కట్ చేసి నియోజకవర్గ సీనియర్ నాయకుడు బోర బంగారురెడ్డికి తినిపించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి శ్రీభరత్ చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం, ఆ వార్డు రామయోగి అగ్రహారం సద్గురు సేవాశ్రమంలో వృద్ధులకు అన్న ప్రసాద వితరణ జరిపారు. ఆశ్రమ నిర్వాహకులు కేపీ రాజు దాత నర్సింగరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బోర రాధాకుమారి, టీడీపీ యువ నాయకులు పాసి త్రినాథకుమార్, పార్టీ నాయకులు పోతిన అప్పలరాజు, శీరపు రమణ, కారి అప్పారావు, మైలపల్లి రాము, మరుపిళ్ల రాజేంద్రప్రసాద్, ఇలిపిల్లి రమణ, సూరాడ రవి, దౌలపల్లి కొండ, ఈశ్వర్‌రెడ్డి, యల్లాజీ, వెంకట్, కోడిబోయిన నాయుడు, ఊళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న పాసి నర్సింగరావు, పాల్గొన్న టీడీపీ నాయకులు

జనసేన కార్పొరేటర్లలో లుకలుకలు

... 5వ పేజీ తరువాయి

ఉదయం అనూహ్యంగా ఆ పార్టీ కార్పొరేటర్ మహ్మద్ సాదిక్ నామినేషన్ దాఖలు చేశారు. దీనిపై ఆ పార్టీ కార్పొరేటర్లు కొందరు సాదిక్‌ను ప్రశ్నించగా, తన వ్యక్తిగత అభిప్రాయమని, పార్టీలో ఎవరికీ చెప్పాల్సిన అవసరం లేదని చెప్పినట్టు తెలిసింది. దీనిపై మేయర్ పీలా శ్రీనివాసరావు ఛాంబర్‌లో జనసేన కార్పొరేటర్ల మధ్య చర్చ జరగ్గా, 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మాట్లాడుతూ పార్టీ ఆదేశాలను ధిక్కరించి, ఫ్లోర్‌లీడర్‌కు సమాచారం ఇవ్వకుండా ఎలా నామినేషన్ వేస్తారంటూ ప్రశ్నించారు. అదే సమయంలో జీవీఎంసీలో జనసేన ఫ్లోర్‌లీడర్‌గా పనిచేస్తున్న బీశెట్టి వసంతలక్ష్మి సమర్థంగా పనిచేయలేకపోతున్నారని, ఆమెను ఆ పదవి నుంచి తొలగించి వేరొకరికి బాధ్యతలు అప్పగించాలని కోరుతూ జనసేనకు చెందిన కొందరు కార్పొరేటర్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. దానికి సంబంధించిన ఫోటోను మీడియాకు విడుదల చేశారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు నేరుగా ఫిర్యాదు చేయాలని కొందరు కార్పొరేటర్లు ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ పార్టీ కార్పొరేటర్లలోఇంతకాలం నివురుగప్పిన నిప్పులావున్న విభేదాలు ఒక్కసారిగా బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది.

ఫెర్టిలిటీ సెంటర్లపై ఆరోగ్య శాఖ కన్ను

... 5వ పేజీ తరువాయి

మూడు ఐవీఎఫ్ సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. ఇందులో ఒయాసిస్, పద్మశ్రీ ఐవీఎఫ్ సెంటర్లు ఉన్నాయి. ఐవీఎఫ్ సెంటర్లలో జరుగుతున్న ప్రక్రియకు సంబంధించిన పూర్తి డేటా అందుబాటులో ఉండేలా చూడాలని ఆయా కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. అలాగే, సరోగసీ నిర్వహించే కేంద్రాలను మరింత క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని కమిటీ సభ్యులకు సూచనలు చేశారు. జిల్లాలోని ఫెర్టిలిటీ సెంటర్లు పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఫిర్యాదులు వస్తే మాత్రం కఠినంగా వ్యవహరిస్తామని, లైసెన్సులు రద్దు చేయడంతోపాటు ఇతర న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు హెచ్చరించారు.

'పొలం పిలుస్తోంది'లో వేరుశెనగ సస్య రక్షణపై సూచనలు

భీమునిపట్నం (రూరల్) జూలై 29 (ఆంధ్రజ్యోతి) : భీమిలి రూరల్ మండలం మజ్జివలస, లక్ష్మీపురం గ్రామాల్లో వేరుపంటను వ్యవసాయాధికారులు మంగళవారం పరిశీలించారు. సస్యరక్షణపై రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. పంట పూత దశలో ఉన్నందున తీసుకోవలసిన చర్యలను మండల వ్యవసాయాధికారి బీఎస్ కోమలి వివరించారు. ఈ పంట పొలాల్లో రెండవ గొప్పకు సంబంధించి ఎకరానికి 200 కిలోల జిప్సం వేస్తే వేరుసెనగలో నూనె శాతం వృద్ధి చెందుతుందన్నారు. ఇందుకోసం అన్ని గ్రామాల్లో పంట పొలాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా ఈ సందర్భంగా జరిగిన రైతుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి భీమిలి మండలంలో వ్యవసాయ భూమి కలిగిన రైతులు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేయాలని కోరారు. పది రెవెన్యూ గ్రామాల్లో ఇంకా 56 మంది రైతుల బ్యాంకు ఖాతాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే సవరించాలని కోరారు. ఈ ఖాతాలు సక్రమంగా ఉంటే ఆగస్టు నెలలో ప్రభుత్వం ఈ ఖాతాల్లో డబ్బులను జమ చేస్తుందని కోమలి తెలిపారు.



మజ్జివలసలో వేరుశెనగ పంట పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు


సురక్షా బీమా పథకాన్ని వినియోగించుకోవాలి

ఆనందపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ద్వారా అందిస్తున్న సురక్షా బీమా పథకాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ సింహచలంనాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆనందపురం యూనియన్ బ్యాంక్‌లో సురక్షా బీమా పథకంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ అనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం అన్నారు. జూలై ఒకటి నుంచి సెప్టెంబరు 30 వరకూ సురక్షా బీమీ పథకంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఇటీవల మరణించిన పీతల శ్రీను, మీసాల సూర్యనారాయణ కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికీ రెండు లక్షల రూపాయల చొప్పున ప్రమాద బీమా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పి-4 నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలి

పద్మనాభం-రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 పథకం నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పాడ రాము మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేద కుటుంబాలను ఉన్నత స్థాయికి తీసుకురావడానికి సంపన్న వర్గాలు దత్తత తీసుకోవాలన్న లక్ష్యంతో పీ4 జాబితా సిద్ధం చేస్తున్నారని ఉపాధ్యాయులు దత్తత తీసుకోవాలని ప్రభుత్వం ఒత్తిడి చేయడాన్ని ఉపసంహరించుకోవాలని అయన తెలిపారు.

కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో సురక్షజ్యోతి ప్రచారం



అవగాహన శిబిరంలో మాట్లాడుతున్న బ్యాంకు జీఎం విజయలక్ష్మి

ఆనందపురం జూలై 29 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని చందక గ్రామంలో ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ డ్రైవ్‌లో భాగంగా కెనరా బ్యాంక్ ఆనందపురం శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయవాడ సర్కిల్ కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ దేశంలో రెండో అతి పెద్ద పీఎస్‌యూ అయిన కెనరా బ్యాంక్ పీఎంఎస్‌బీవై, పీఎంజేపీవై, ఏపీవై వంటి సామాజిక భద్రతా పథకాలను విస్తృతంగా అమలు చేస్తోందన్నారు. అందరకీ బ్యాంకింగ్ లక్ష్యాన్ని సాధించాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పని చేస్తున్నట్టు తెలిపారు. విశాఖ డివిజనల్ మేనేజర్ హెచ్.ప్రతాప్‌కుమార్,స్థానిక సర్పంచ్ బంక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్


విజిటర్స్ రిజిష్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆరిలోవ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : చినగదిలి గ్రామీణ మండలం తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో గల ఈవీఎం గోదాంలను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ మంగళవారం సందర్శించి తనిఖీ చేశారు. నెలవారి తనిఖీల్లో భాగంగా మంగళవారం ఉదయం గోదాంలను సందర్శించి ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమారాల పని తీరు, ప్రధాన ద్వారాలకు ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ ఉన్న అధికారులు, భద్రతా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. పర్యటనలో భాగంగా అక్కడ ఉన్న విజిటింగ్ రిజిస్టర్‌లో ఆయన సంతకం చేశారు. కార్యక్రమంలో గ్రామీణ తహసీల్దార్ పాల్‌కిరణ్, స్థానిక రెవెన్యూ సిబ్బంది, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాలయాలను పరిరక్షించాలి


సంతకాలు సేకరిస్తున్న ఏఐడీఎస్వో కార్యకర్తలు

మద్దిలపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాల వద్ద మంగళవారం ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్ యూనియన్ (ఏఐడీఎస్వో) ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యాలయాలు పరిరక్షించాలని కోరుతూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐడీఎస్వో నగర అధ్యక్షుడు అభిలాష్ మాట్లాడుతూ 'ప్రభుత్వ నిధులతో నిర్వహించే విద్యను కాపాడండి' నినాదంతో 10 లక్షల సంతకాలు సేకరిస్తామన్నారు. ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్ వర్ధంతి పురస్కరించుకుని చేపట్టే ఈ కార్యక్రమం డిశంబర్ 28వరకు కొనసాగుతుందన్నారు. ఎంతో మంది మహానుభావుల త్యాగాల కృషి ఫలితంగా దేశంలో ప్రభుత్వ పాఠశాలలు ఏర్పడ్డాయన్నారు. వాటిని మరింత అభివృద్ధి చేసి ఉన్నతమైన విద్య అందించాల్సిన ప్రభుత్వాలు రకారకాల పేర్లతో పాఠశాలలు మూసివేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా మేల్కొని స్కూల్స్ విలీనం ఆపాలని డిమాండ్ చేశారు.

సినిమా గైడ్

● **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీవెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)

● **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

● **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 40, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 34, పచ్చిమిర్చి 72, కాకరకాయలు 26, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 24, క్యారెట్ 44,దొండకాయలు 26, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 42, అల్లం (పాతది) 66, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోసకాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 30, క్యాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

కాలువలపైనే నివాసం.. దుర్గంధం, దోమలతో సహవాసం

» ఫిషింగ్ హార్బర్ వద్ద దుర్భర స్థితిలో పేదలు » గుడారాల్లోనే జీవనం » పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


పేదలు నివాసం ఉండే కాలువ కింద భాగంలో పేరుకుపోయిన చెత్తాచెదారం


ఫిషింగ్ హార్బర్ మెయిన్ రోడ్డు వద్ద కాలువపై పేదల గుడారాలు

బీచ్‌రోడ్డు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) :ఫిషింగ్ హార్బర్ వద్ద మెయిన్ రోడ్డు కాలువపై కొంతమంది నిరుపేదలు ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తున్నారు. 55 కుటుంబాలు ఉంటున్న ఈ ప్రాంతంలో నిరుపేదల బతుకు క్షణమొక యుగంలా ఉంది. ఇక్కడ పరిసరాలు పూర్తిగా దుర్గంధభరితమయ్యాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ఎప్పుడు ఏ వ్యాధి వస్తుందోనన్న భయాందోళన నెలకొంది.ఇళ్ల ముంగిట కాలువల్లో చెత్త పేరుకుపోయింది. నెలల తరబడి పూడికలు తీయకపోవడంతో మురుగు నీరు వీధుల్లో ప్రవహిస్తోంది. దీనివల్ల ఒకవైపు దుర్గంధం, మరోవైపు దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటోంది. పారిశుధ్య కార్మికులు ఇద్దరు లేదా ముగ్గురు ఉండడంతో చెత్త తరలింపు సక్రమంగా జరగడం లేదు. ఈ విషయమై స్థానికులు తరచూ పాలకులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. తమ గురించి ఏ ప్రజా ప్రతినిధో, అధికారో పట్టించుకోరా అన్న ఆశలో ఇక్కడి పేదలు ఎదురు చూస్తున్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

పెదవాల్తేరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు కోరారు. జీవీఎంసీ 17వ వార్డు పెదవాల్తేర్, ఆదర్శనగర్, ఇందిరా నగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, అన్ని ప్రాంతాల అభివృద్ధి తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్, 17వ వార్డు కార్పొరేటర్ గేదేల లావణ్య నాగరాజు, టీడీపీ నేతలు నెక్కింటి సత్తిబాబు, నరేంద్ర, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకంగా కళాశాలల నిర్వహణ

» ఆర్‌ఐవో మురళీధర్


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఐవో మురళీధర్

మద్దిలపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కళాశాలల నిర్వహణలో పారదర్శకత పెంపొందించుకోవాలని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి బి.మురళీధర్ సూచించారు. ఏవీఎన్ కళాశాలలో మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలల యాజామాన్యాలు విద్యాప్రమాణాలు మెరుగుపరిచి ఉత్తీర్ణత శాతం పెంచే విధంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం కల్పించిన విద్యార్థుల హక్కులను అమలు చేయాలని లేకపోతే కఠిన చర్యలు ఉంటాయన్నారు. విద్యారంగంలో ఈ ఏడాది నుంచి చోటుచేసుకున్న వినూత్న మార్పులు, సిలబస్ మార్పు, అకడమిక్ సంస్కరణలు, కళాశాలల నిర్వహణలో అనుసరించాల్సిన నిబంధనలు, అలాగే బోర్డు నుంచి జారీ చేసిన తాజా మార్గదర్శకాలను వివరించారు. ప్రతి కళాశాల బోర్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించి నడుచుకోవాలని స్పష్టం చేశారు.

పైడిమాంబ ఆలయంలో శ్రావణ పూజలు

ఆరిలోవ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పాత డెయిరీ ఫారం వద్ద జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పైడిమాంబ అమ్మవారి ఆలయంలో శ్రావణ మంగళవారం పూజలు వైభవంగా నిర్వహించారు. వేద పండితులు గోపీశర్మ వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు మధ్య అమ్మవారికి ప్రత్యేకంగా పసుపు కుంకుమలతో సమర్పించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు.

అలాగే పాత డెయిరీ ఫారం వెటర్నరీ కాలనీలో వెలసిన నూకమాంబ అమ్మవారి ఆలయంలో కూడా శ్రావణ మంగళవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు అమ్మవారికి గాజులతో అందంగా తీర్చిదిద్ది అలంకరించారు. అనంతరం భక్తులు కుంకుమార్చనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా భూలోకమాత అమ్మవారి పండుగ


ఆలయంలోని పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, గ్రామ సేవా సంఘం ప్రతినిధులు

వెంకోజీపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం గ్రామ ఇలవేల్పు శ్రీభూలోకమాత అమ్మవారి వార్షిక పండుగ మహోత్సవాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.. తెల్లవారు జాము నుంచి భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులను సమర్పించారు. అమ్మవారి ఘటాలను తలపై మోస్తూ ఆలయానికి విచ్చేసి మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు సాయి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాన్ని నిర్వహించారు. భక్తుల గోత్ర నామాలతో ప్రత్యేక అభిషేకాలు జరిపారు. తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఆయన తనయుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరిని సంఘ ప్రతినిధులు ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. సాయంత్రం పరస సంబరం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పాత వెంకోజీపాలెంలోని కనకమ్మ ఆలయానికి తీసుకువెళ్లి అక్కడ పసుపు, కుంకుమ సమర్పించి తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. గ్రామస్థులంతా పాల్గొని ఆనందంతో గడిపారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీలా ప్రేమ్‌కిరణ్ జగదీష్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు సూరిశెట్టి సిమ్మినాయుడు, మళ్ల రవికుమార్, కోరిబిల్లి ఈశ్వరరావు, శరకం అప్పలరాజు, కాళ్ల ఆనంద్, మాజీ అధ్యక్షుడు మద్దాల వీరవెంకట అప్పారావు, బోర ధనరెడ్డి, కాళ్ల శంకర్, ఎస్.నరసింహారెడ్డి, ఎర్రాజీ రెడ్డి, కాళ్ల వరహాలు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, మహిళా మండలి సభ్యురాలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలపై నిరంతర పర్యవేక్షణ

» అధికారులకు జేసీ మయూర్ అశోక్ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్


మహారాణిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువులు బియ్యం, పంచదార, పప్పుదినుసులను సరసమైన ధరలకే వినియోగదారులకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ధరల నియంత్రణపై సమీక్షించి మార్గదర్శకాలు జారీ చేసేందుకు పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు, వర్తకులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర నిబంధనలకు లోబడే స్టాక్ నిల్వలు ఉంచాలని, పరిమితికి మించి నిల్వ చేయరాదన్నారు. బియ్యం, పంచదార, పప్పుదినుసుల ధరలు క్రమంగా పెరుగుతున్నాయని, ఈ పరిణామం ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని అన్నారు. అందువల్ల లాభనష్టాల ప్రమేయం లేకుండా సరసమైన ధరలకు విక్రయించాలని జేసీ ఆదేశించారు. ధరల పర్యవేక్షణకు ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 13 రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు ప్రారంభించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

గ్యాస్ డెలివరీ చార్జీలు వసూలు చేస్తే చర్యలు

ఇళ్లకు గ్యాస్ సిలిండర్ డెలివరీ చేస్తున్న సమయంలో రసీదుపై ముద్రించిన రుసుము కన్నా అదనపు చార్జీలు వసూలు చేయరాదని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ స్పష్టంచేశారు. గ్యాస్ డెలివరీ సమయంలో బాయ్స్ డెలివరీ చార్జీలు వసూలు చేస్తున్నట్లు అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, ఇకపై అలా చేయటానికి వీలు లేదని హెచ్చరించారు. చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే గ్యాస్ ఏజెన్సీలకు నోటీసులిచ్చి డీలర్లపైనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

భూ కేటాయింపు ఒప్పందాలు బహిర్గతం చేయాలి

» వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు


మాట్లాడుతున్న కేకే రాజు

మద్దిలపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పడిన పదిహేను నెలల కాలంలో ప్రైవేట్ సంస్థలకు కేటాయించిన భూ ఒప్పందాలను బహిర్గతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు డిమాండ్ చేశారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత ఖరీదైన భూములను పప్పు బెల్లాల్లా పంచిపెడుతున్నారన్నారు. బీచ్ రోడ్డులో రూ.వేల కోట్ల విలువైన 13.74 ఎకరాలు భూములను 99 ఏళ్లకు చదరపు అడుగు రూపాయిన్నరకు లూలూ సంస్థకు కట్టబెట్టడం వెనుక భారీ అవినీతి ఉందని ఆరోపించారు. సత్వా డెవలపర్స్ రూ.1500 కోట్లు పెట్టుబడి పెట్టడం ద్వారా 25 వేల ఉద్యోగాలు కల్పిస్తారని వందల కోట్ల భూములు ఇచ్చారని ఆసంస్థ రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసే సంస్థని ఉద్యోగాలు ఎక్కడిస్తారని ప్రశ్నించారు. పెట్టుబడుల పేరుతో కపిల్, ఉర్సా గ్రూపులకు కూడా భారీ ఎత్తున భూకేటాయింపులు చేశారన్నారు. పెట్టుబడులు, ఉపాధికి తాము వ్యతిరేకం కాదని, ఉపాధికి రాయితీలిస్తే ఫర్వాలేదు కాని కూటమి పెద్దలు రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థలకు వేల కోట్ల భూములు దోచుపెడుతున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా మేల్కోకుంటే భవిష్యత్‌లో నగరంలో అభివృద్ధికి సెంటు భూమి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు.

వాకర్స్‌కు వైద్య పరీక్షలు


వాకర్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎంవీపీ కాలనీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ సర్కిల్ వద్దనున్న ఏఎస్ రాజా మైదానంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయపు నడకకు వచ్చిన వారికి బీపీ, మధుమేహ పరీక్షలను ఉచితంగా చేశారు. మెడికవర్ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 45 మంది వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో పాటు, ఇతరులకూ పరీక్షలు చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు పి.కిషోర్‌కుమార్, జాలీ వాకర్ డాక్టర్ పప్పూర్ నికుంజ్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌కు బాక్సర్‌ను అందించడమే లక్ష్యం

» రాష్ట్ర బాక్సింగ్ సంఘం నూతన అధ్యక్షుడు వెంకటేశ్వరరావు


నూతన కార్యవర్గం పరిచయ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బాక్సింగ్ క్రీడాంశానికి ప్రాధాన్యత తీసుకువచ్చి ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించే ఉన్నత స్థాయి బాక్సర్‌ను తీర్చిదిద్దడమే తమ ముందున్న లక్ష్యమని రాష్ట్ర బాక్సింగ్ సంఘం నూతన అధ్యక్షుడు, ద్రోణాచార్య అవార్డీ ఐ.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం వీజేఎఫ్‌లో జరిగిన నూతన కార్యవర్గ పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లు కొనసాగే నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని, అన్ని జిల్లాల బాక్సింగ్ సంఘాల ప్రతినినిధులకు ప్రాధాన్యత కల్పించామన్నారు. వర్ధమాన ఔత్సాహిక క్రీడాకారులను ఉన్నత స్థాయి బాక్సర్లగా తయారుచేసే దిశగా ముందుకు వెళతామన్నారు. ప్రతిభ గల బాక్సర్లకు ఉద్యోగాలు పొందే దిశగా తీసుకువెళ్లాలని తీర్మానించామని పేర్కొన్నారు. దీనిలో భాగంగా శాయ్, శాప్ వంటి ప్రభుత్వ సంస్థల సహకారంతో కోచింగ్ విధానాన్ని అభివృద్ధి చేసి ఆధునిక పద్ధతులతో శిక్షణ శిబిరాలు నిర్వహించి ఉన్నత స్థాయి బాక్సర్లను అందించే దిశగా సేవలందిస్తామన్నారు. ఒలింపిక్ గేమ్స్‌కు బాక్సర్‌ను అందించాలన్న ఆశయం నూతన కార్యవర్గం తీరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బాక్సింగ్ క్రీడలో విశాఖకు ప్రత్యేక స్థానముందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అర్జున, ద్రోణాచార్య, ధ్యాన్‌చంద్ వంటి అత్యుత్తమ అవార్డులందుకున్న ఘనత విశాఖ బాక్సింగ్‌కు దక్కుతుందని పేర్కొన్నారు.

నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా ఐ.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పి.మధుసూదనరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా రెడ్డి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా కె.వేణుగోపాలరావు, ఉపాధ్యక్షులుగా బి.ఎ.లక్ష్మణదేవ్, డి.నాగేశ్వరరావు, డి.మన్మథకుమార్, సంయుక్త కార్యదర్శులుగా జి.రమ్య, బి.సురేంద్ర బాబు, సిహెచ్.చంద్రశేఖర్, వైవీఎస్.ఉమామహేశ్వరరావు, ఎస్.మహేష్‌కుమార్, డి.శివరామ కృష్ణ, కోశాధికారిగా కె.శ్రీనివాసరావు, మరో నలుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎన్నిక కాగా, చైర్మన్ ఐ.చిట్టిబాబు నియమితులయ్యారు. జడ్డి గడ్డెన్న నేతృత్వంలో జరిగిన ఈ ఎన్నికలకు రాష్ట్ర ఒలింపిక్ సంఘం నుంచి కంచరాన సూర్యనారాయణ, స్పోర్ట్సు అథారిటీ ఆంధ్రప్రదేశ్ నుంచి వెంకటరమణ, బాక్సింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు బోపు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. రిటర్నింగ్ అధికారిగా ఇండియన్ రైల్వే బాక్సింగ్ కోచ్ రెడ్డి శ్రీనివాసరావు వ్యవహరించారని నూతన అధ్యక్షుడు ఐ.వెంకటేశ్వరరావు తెలిపారు.

జూలో ఘనంగా గ్లోబల్ టైగర్స్ డే

ఆరిలోవ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : గ్లోబల్ టైగర్స్ డే సందర్భంగా ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో మంగళవారం పలు పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ పులులు భూమిపై ఒక కీలక, అరుదైన జాతికి చెందిన వన్యప్రాణులన్నారు. పులుల ఉనికి మన పర్యావరణ ఆరోగ్యాన్ని సూచిస్తుందన్నారు. రాయల్ బెంగాల్ టైగర్స్, తెల్ల పులుల సంరక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుయన్నారు. పులుల గురించి తెలుసుకోవడంపై విద్యార్థులు ఆసక్తి చూపాలన్నారు. ఇది విజ్ఞాన దాయక అంశమన్నారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు అవగాహన పెంచుకొని, అందుకోసం కృషి చేయాలన్నారు. పర్యావరణ ప్రధానంగా, వన్య ప్రాణుల జీవన విధానాన్ని ప్రతిబింబించేలా విద్యార్థులు వేసిన వివిధ చిత్రాలు ఆకట్టుకున్నాయి. అనంతరం డాక్యుమెంటరీలు, పులులకు సంబంధించిన విజ్ఞానదాయక ప్రదర్శన అలరించాయి. కార్యక్రమంలో జూ సిబ్బంది పాల్గొన్నారు.


పెయింటింగ్స్ వేస్తున్న విద్యార్థులు

చినుకు పడితే చిత్తడే!


ఎంపీపీ రెండో సెక్టరులో నిలిచిపోయిన వర్షం నీరు

ఎంవీపీ కాలనీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : వెంకోజీపాలెం దరి 900 బస్టాపు సమీపంలోని ఓ వీధి మలుపు వద్ద చిన్న చినుకు పడినా బురదమయం అవుతోంది. దీంతో ఈ రహదారిలో నడవడానికి కూడా ఇబ్బంది ఎదురవుతోంది. పక్కా రహదారి నిర్మాణం ఉన్నా, సరైన డ్రైనేజీ వ్యవస్థ ఇక్కడ అందుబాటులో లేకపోవడంతో, కొద్దిపాటి వర్షానికి నీరు నిలిచిపోతోంది. ఒక నిమిషం పాటు చినుకులు పడితే పది రోజుల పాటు ఇక్కడ చిత్తడి నెలకొని ఇబ్బందిగా మారుతోంది.

ఎంవీపీ కాలనీ రెండో సెక్టరులో ఈ పరిస్థితి నిత్యం కనిపిస్తోంది. ఇక్కడి పరిస్థితిని శాశ్వతంగా చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

'గురుకుల పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు'

ఆరిలోవ, జూలె 29(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్ తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్రంలో గల 73 గురుకుల పాఠశాలల అభివృద్ధికి రూ.7.81 కోట్లు కేటాయించిందని ఆయన వెల్లడించారు. ఆయన శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ స్కూలు కార్పొరేట్ పాఠశాలను తలపిస్తున్నదని ప్రశంసించారు. మేఘాద్రిగెడ్డ గర్ల్సును కూడా సందర్శించినట్టు చెప్పారు. పాఠశాల మౌలిక సదుపాయల కల్పన, విద్యా ప్రమాణాల మెరుగు, విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పార్చన


అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

మహారాణిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం తొలి మంగళవారం సందర్భంగా బురుజుపేటలో ఉన్న కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ లక్ష్మి పూజలు, స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేద పండితులు, అర్చకులు అమ్మవారికి స్వర్ణ పుష్పాలతో అర్చన చేసి అనంతరం ఆయుష్ హోమం నిర్వహించారు. ఉభయదాతలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

మంగళగౌరీ రూపంలో పరదేశమ్మ


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అక్కయ్యపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా పరదేశమ్మ అమ్మవారు మంగళవారం మంగళగౌరీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని లక్ష గాజులు, లక్ష పసుపు కొమ్ములతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

ఘనంగా మంగళగౌరీ వ్రతం


పూజల్లో పాల్గొన్న మహిళలు

మురళీనగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్‌లో మంగళవారం స్థానిక గౌరీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళగౌరీ వ్రతం వైభవంగా జరిపారు. స్కేటింగ్ పార్కు ఎదుటే ఉన్న సంఘం కార్యాలయ ఆవరణలో సామూహిక కుంకుమ పూజా మహోత్సవాలు నిర్వహించారు. ఎన్‌జీజీఓస్ కాలనీ, మాధవధార, మురళీనగర్ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో మహిళలు పూజల్లో పాల్గొన్నారు. టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ పూజాదికాలు చేశారు. గౌరీ సేవాసంఘం కమిటీ సభ్యులు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో యోగ సిద్ధాంజనేయుడు

మాధవధార, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపాన ఉన్న సూర్యానగర్ యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ధూప దీప నైవేద్యాలతో సింధూర అర్చనలు, తమలపాకులతో పూజలు చేపట్టారు. ఆలయ అర్చకుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో నైవేద్యం సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.సుబ్బరాజు, యశోద దంపతులు, ఎంవీ రాజశేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు


చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

జ్ఞానాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ పార్లమెంటు సభ్యుడు ఎం.శ్రీభరత్ జన్మదిన వేడుకలు మంగళవారం 33వ వార్డు పరిధిలోని అల్లిపురంలో టీడీపీ నాయకులు విల్లూరి చక్రవర్తి, తిరుమలాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని మహిళలకు చీరలు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీశెట్టి శ్రీనివాసరావు, ఎస్.శంకర్రావు, కె.భాస్కర్. కె.అప్పారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కొత్త విద్యుత్ లైన్లు వేసే నిమిత్తం బుధవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సీతంపేట, శ్రీహరి స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్స్) పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

స్వచ్ఛంద సేవా సంస్థల ఫోరం కమిటీ

మహారాణిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థల ఫోరం కమిటీ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షురాలిగా సుబ్బలక్ష్మి, ఉపాధ్యక్షులుగా డేవిడ్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా జేవీ రత్నం, కోశాధికారిగా ఎ.మున్నీరు ఎన్నికయ్యారు.

నిత్యావసర వస్తువుల ధరలపై నిరంతర పర్యవేక్షణ

» అధికారులకు జేసీ ఆదేశం


అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

మహారాణిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువులు బియ్యం, పంచదార, పప్పుదినుసులను సరసమైన ధరలకే వినియోగదారులకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ధరల నియంత్రణపై సమీక్షించి మార్గదర్శకాలు జారీ చేసేందుకు పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు, వర్తకులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర నిబంధనలకు లోబడే స్టాక్ నిల్వలు ఉంచాలని, పరిమితికి మించి నిల్వ చేయరాదన్నారు. బియ్యం, పంచదార, పప్పుదినుసుల ధరలు క్రమంగా పెరుగుతున్నాయని, ఈ పరిణామం ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని అన్నారు. అందువల్ల లాభనష్టాల ప్రమేయం లేకుండా సరసమైన ధరలకు విక్రయించాలని జేసీ ఆదేశించారు. ధరల పర్యవేక్షణకు ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 13 రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు ప్రారంభించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

గ్యాస్ డెలివరీ చార్జీలు వసూలు చేస్తే చర్యలు

ఇళ్లకు గ్యాస్ సిలిండర్ డెలివరీ చేస్తున్న సమయంలో రసీదుపై ముద్రించిన రుసుము కన్నా అదనపు చార్జీలు వసూలు చేయరాదని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ స్పష్టంచేశారు. గ్యాస్ డెలివరీ సమయంలో బాయ్స్ డెలివరీ చార్జీలు వసూలు చేస్తున్నట్లు అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, ఇకపై అలా చేయటానికి వీలు లేదని హెచ్చరించారు. చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే గ్యాస్ ఏజెన్సీలకు నోటీసులిచ్చి డీలర్లపైనే చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

ప్లాస్టిక్స్ పాలిమర్స్ బ్రాంచికి ఎన్‌బీఏ గుర్తింపు



కళాశాల వద్ద విభాగాధిపతులతో ప్రిన్సిపాల్ రమణ

కంచరపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల ప్లాస్టిక్స్ పాలిమర్స్ బ్రాంచికి నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ మంగళవారం వివరాలను వెల్లడించారు. ఇటీవల కళాశాలను ఎన్‌బీఏ కమిటీ సందర్శించింది. కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న బోధన, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, క్రీడలు, ల్యాబ్‌లు తదితర విభాగాలను కమిటీ ప్రతినిధులు పరిశీలించి వెళ్లారు. కళాశాలలో వసతులు, విద్యావిధానంపై సంతృప్తి వ్యక్తం చేసిన కమిటీ గుర్తింపు ధ్రువపత్రాన్ని అందజేసిందన్నారు. ఈ సందర్భంగా ఆయా బ్రాంచి విభాగాధిపతులు, అధ్యాపకులను డా.కె.వి. రమణ అభినందించారు. ఈ కార్యక్రమంలో డా.ఎస్.ప్రశాంత కుమారి, వేణుమాధవ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పాపా హోమ్‌కి బియ్యం వితరణ


బియ్యం అందచేస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

సీతమ్మధార, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో గల పాపాహోమ్‌కి నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ ఎ.సత్యనారాయణ ఆర్థిక సహాయంతో బియ్యం బస్తాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ముఖ్య అతిథిగా విచ్చేసి బియ్యం బస్తాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పాపాహోమ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌కు బాక్సర్‌ను అందించడమే లక్ష్యం

» రాష్ట్ర బాక్సింగ్ సంఘం నూతన అధ్యక్షుడు వెంకటేశ్వరరావు


నూతన కార్యవర్గ పరిచయ కార్యక్రమంలో మాట్లాడుతున్న బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బాక్సింగ్ క్రీడకు ప్రాధాన్యత కల్పించి ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించే ఉన్నత స్థాయి బాక్సర్‌ను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని రాష్ట్ర బాక్సింగ్ సంఘం నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన ఐ.వెంకటేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం వీజేఎఫ్‌లో జరిగిన నూతన కార్యవర్గ పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల కొనసాగే నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని, అన్ని జిల్లాల బాక్సింగ్ సంఘాల ప్రతినినిధులకు ప్రాధాన్యత కల్పించామన్నారు. ప్రతిభ గల బాక్సర్లకు ఉద్యోగాలు లభించేలా కృషిచేయాలని తీర్మానించామన్నారు. శాయ్, శాప్ సంస్థల సహకారంతో ఆధునిక పద్ధతులతో శిక్షణ శిబిరాలు నిర్వహించి ఉన్నత స్థాయి బాక్సర్లను అందించే దిశగా సేవలందిస్తామన్నారు. బాక్సింగ్ క్రీడలో విశాఖకు ప్రత్యేక స్థానముందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అర్జున, ద్రోణాచార్య, ధ్యాన్‌చంద్ వంటి అత్యుత్తమ అవార్డు లందుకున్న ఘనత విశాఖ బాక్సింగ్‌కు దక్కుతుందన్నారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా ఐ.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పి.మధుసూదనరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా రెడ్డి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా కె.వేణుగోపాలరావు, ఉపాధ్యక్షులుగా బి.ఎ.లక్ష్మణదేవ్, డి.నాగేశ్వరరావు, డి.మన్మథకుమార్, సంయుక్త కార్యదర్శులుగా జి.రమ్య, బి.సురేంద్రబాబు, సిహెచ్.చంద్రశేఖర్, వైవీఎస్.ఉమామహేశ్వరరావు, ఎస్.మహేష్‌కుమార్, డి.శివరామకృష్ణ, కోశాధికారిగా కె.శ్రీనివాసరావు, మరో నలుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎన్నిక కాగా, చైర్మన్ ఐ.చిట్టిబాబు నియమితులయ్యారు. జడ్జి గడ్డెన్న నేతృత్వంలో జరిగిన ఎన్నికలకు రాష్ట్ర ఒలింపిక్ సంఘం నుంచి కంచరాన సూర్యనారాయణ, స్పోర్ట్సు అథారిటీ ఆంధ్రప్రదేశ్ నుంచి వెంకట రమణ, బాక్సింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు బోపు పర్యవేక్షకులుగా, రైల్వే బాక్సింగ్ కోచ్ శ్రీనివాసరావు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారని తెలిపారు.

మత్స్యకారులకు ఇంజన్లు, ట్రాన్స్‌పాండర్ల పంపిణీ


మహిళకు ఇంజన్ అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మహారాణిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద మత్స్యకారులకు 40 శాతం సబ్సిడీపై ఏడు ఇంజన్లు, వందశాతం సబ్సిడీపై ఆరు ట్రాన్స్‌పాండర్లను దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ అందజేశారు. ఫిషింగ్ హార్బర్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆపద నుంచి మత్స్యకారులను కాపాడడానికి ట్రాన్స్‌పాండర్ ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా మత్స్యకారులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు, ఎఫ్‌డీవో ఆశాజ్యోతి, బోటు సంఘాల యజమానులు పాల్గొన్నారు.

కళాకారులను గౌరవించాలి


గాయని సత్యవతిని సత్కరిస్తున్న అతిథులు

సీతంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కళలను గౌరవిస్తేనే కళాకారులకు మంచి గుర్తింపు ఇచ్చినట్లవుతుందని 'సత్య సుమధుర స్వరాలు' సంగీత సంస్థ గౌరవ అధ్యక్షుడు, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ రాష్ట్ర కన్వీనర్ కట్ట మల్లేశ్వరరావు పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో సంగీత సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సీనియర్ గాయని సత్యవతి సన్మాన కార్యక్రమం, సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి. కార్యక్రమంలో భాగంగా సీనియర్ గాయని, సంస్థ వ్యవస్థాపకురాలు సత్యవతి ఖాన్‌ను కళాకారుల సమక్షంలో మల్లేశ్వరరావు, సామాజికవేత్త సన్‌మూర్తి, సంఘం అధ్యక్షుడు భయ్యా శ్రీనివాస్ తదితరులు సన్మానించారు. సంస్థ కార్యదర్శి పి.బి.ఖాన్, పెమ్మరాజు రామ్, ఎం.శ్రీనివాసరావు, కె.ఎల్.రావు, రామ నర్సింహం, సుబ్బారావు, నాయుడు ఖాన్, రంజిత, మాధురి, అంబిక, గంటి ఉష, ఎస్.రాజేశ్వరరావు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనతోనే అభివృద్ధి: దువ్వారపు


సంకురపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న దువ్వారపు రామారావు, కార్తీక్ కుట్టా

కంచరపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు పేర్కొన్నారు. జీవీఎంసీ 54వ వార్డు పరిధి ఐటీఐ జంక్షన్ సంకురపేటలో మంగళవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన దువ్వారపు రామారావు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అనేక హామీలు అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు కుట్టా కార్తీక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెంటకోట స్రవంతి, కార్యదర్శి శేఖర్, కుమార్, పీలా రమణ, శ్రీధర్,మాధవరావు పాల్గొన్నారు.

ఫెర్టిలిటీ సెంటర్లపై ఆరోగ్య శాఖ కన్ను

... 5వ పేజీ తరువాయి

మూడు ఐవీఎఫ్ సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. ఇందులో ఒయాసిస్, పద్మశ్రీ ఐవీఎఫ్ సెంటర్లు ఉన్నాయి. ఐవీఎఫ్ సెంటర్లలో జరుగుతున్న ప్రక్రియకు సంబంధించిన పూర్తి డేటా అందుబాటులో ఉండేలా చూడాలని ఆయా కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. అలాగే, సరోగసీ నిర్వహించే కేంద్రాలను మరింత క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని కమిటీ సభ్యులకు సూచనలు చేశారు. జిల్లాలోని ఫెర్టిలిటీ సెంటర్లు పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఫిర్యాదులు వస్తే మాత్రం కఠినంగా వ్యవహరిస్తామని, లైసెన్సులు రద్దు చేయడంతోపాటు ఇతర న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు హెచ్చరించారు.

వైసీపీ భూస్థాపితం కావడం ఖాయం: రాజుగౌడ్

డాబాగార్డెన్స్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ భూస్థాపితం కావడం ఖాయమని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ వ్యవస్థాపక అధ్యక్షుడు, జనసేన నాయకుడు రాజుగౌడ్ యాత అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.వైసీపీ నాయకుల రౌడీ రాజకీయాలు గమనించే 2024 ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా నేర్చుకోవడం లేదని విమర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌పై 41వ వార్డు కార్పొరేటర్ భర్త కోడిగుడ్ల శ్రీధర్ నీచంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి దృష్టిసారిస్తున్న ఎమ్మెల్యేపై అవాకులు చవాకులు పేలితే ప్రజలు హర్షించరన్నారు. సమావేశంలో నగర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్, నాయకులు శరణ్‌సాయి, సయ్యద్‌సాయి, దిలీప్, అస్ఘర్ అలీ పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను తక్షణమే ఉపసంహరించాలి

మాజీ ఎమ్మెల్సీ శర్మ డిమాండ్


సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ


డైమండ్ పార్కు వద్ద నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

డాబాగార్డెన్స్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించాలన్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, ప్రజలపై భారం వేసే ఆదాని స్మార్ట్ మీటర్లు వద్దని కార్మిక, ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 'విద్యుత్ స్మార్ట్ మీటర్ల రద్దు, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణల్లో భాగంగానే ఆదానీ స్మార్ట్ మీటర్లు వచ్చాయన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఏపీఎస్ఈబీని మూడు ముక్కలుగా చేసి ట్రాన్స్‌కో, జెన్కో, డిస్కం పేరుతో విభజించిందన్నారు. ఇప్పుడు విద్యుత్ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు పూనుకుందన్నారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎస్‌కే రెహమాన్ మాట్లాడుతూ ఎన్నికలయ్యే వరకు ఒక మాట, ఎన్నికల తరువాత మరో మాట చెప్పడం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. పీఓడబ్ల్యు అధ్యక్షురాలు ఎం.లక్ష్మి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఇప్పటికే విమానాశ్రయాలు, పోర్టులు, గనులు, రైల్వేలను ప్రైవేట్‌పరం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ అధ్యక్షత వహించగా, నాయకులు మన్మధరావు, దేవ, తిరుపతిరావు, బేగం, గౌరీ, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు, వర్కర్ల ఫెడరేషన్ నిరసన

అక్కయ్యపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు ఏర్పాటు చేయనున్న స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్లు, వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డైమండ్ పార్క్ సమీపంలో మంగళవారం ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఆదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ అదనపు విద్యుత్ చార్జీ రద్దు చేయాలన్నారు. నాయకులు శివాజీ, దేముడు, నాగరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీకి 21 నామినేషన్లు

... 5వ పేజీ తరువాయి

కేతన్‌గార్గ్ ఈ నెల 21న నోటిఫికేషన్ జారీచేశారు. వైసీపీ నుంచి పది మంది కార్పొరేటర్లు 26న నామినేషన్లు దాఖలు చేశారు. కూటమి పార్టీల మధ్య సీట్లు పంపకాలు తేలకపోవడంతో మంగళవారం వరకూ అభ్యర్థులను ఎంపిక చేయలేకపోయారు. చివరకు జనసేన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీకి దిగడం లేదని స్పష్టం చేయడంతో, బీజేపీకి ఒక సీటు కేటాయించి మిగిలిన తొమ్మిది సీట్లకు టీడీపీ కార్పొరేటర్లను పోటీకి నిలపాలని నిర్ణయించారు. 39వ వార్డు నుంచి ఇండిపెండెంట్‌గా గెలిచి వైసీపీలో చేరి, ప్రస్తుతం జనసేనలో చేరిన మహ్మద్ సాదిక్ మంగళవారం ఉదయాన్నే నామినేషన్ దాఖలు చేయడం కూటమి పార్టీల్లో చర్చనీయాంశమైంది. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే వంశీకృష్ణ అధ్యక్షతన సోమవారం కార్పొరేటర్లంతా సమావేశమై పోటీకి దూరంగా ఉండాలనే అభిప్రాయానికి వచ్చామని, కానీ సాదిక్ మాత్రం పార్టీ అనుమతి లేకుండానే నామినేషన్ దాఖలు చేశారని కొందరు కార్పొరేటర్లు చెబుతున్నారు. రెండో తేదీ వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ఉండడంతో సాదిక్ వెనక్కి తగ్గే అవకాశం ఉందని టీడీపీ కార్పొరేటర్లు అభిప్రాయపడుతున్నారు.

జనసేన కార్పొరేటర్లలో లుకలుకలు

... 5వ పేజీ తరువాయి

ఉదయం అనూహ్యంగా ఆ పార్టీ కార్పొరేటర్ మహ్మద్ సాదిక్ నామినేషన్ దాఖలు చేశారు. దీనిపై ఆ పార్టీ కార్పొరేటర్లు కొందరు సాదిక్‌ను ప్రశ్నించగా, తన వ్యక్తిగత అభిప్రాయమని, పార్టీలో ఎవరికీ చెప్పాల్సిన అవసరం లేదన్నట్టు తెలిసింది. దీనిపై మేయర్ పీలా శ్రీనివాసరావు ఛాంబర్‌లో జనసేన కార్పొరేటర్ల మధ్య చర్చ జరగ్గా, 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మాట్లాడుతూ పార్టీ ఆదేశాలను ధిక్కరించి, ఫ్లోర్‌లీడర్‌కు సమాచారం ఇవ్వకుండా ఎలా నామినేషన్ వేస్తారని ప్రశ్నించారు. అదే సమయంలో జీవీఎంసీలో జనసేన ఫ్లోర్‌లీడర్‌గా పనిచేస్తున్న బీశెట్టి వసంతలక్ష్మి సమర్థంగా పనిచేయలేకపోతున్నారని, ఆమెను తొలగించి వేరొకరికి బాధ్యతలు అప్పగించాలని కోరుతూ జనసేనకు చెందిన కొందరు కార్పొరేటర్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. దానికి సంబంధించిన ఫోటోను మీడియాకు విడుదల చేశారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు నేరుగా ఫిర్యాదు చేయాలని కొందరు కార్పొరేటర్లు ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ పార్టీ కార్పొరేటర్లలో ఇంతకాలం నివురుగప్పిన నిప్పులావున్న విభేదాలు ఒక్కసారిగా బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది.

చదవడం, రాయడం రావడం లేదు

... 5వ పేజీ తరువాయి

విద్యావేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'సంసిద్ధత' అమలు

ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యా శాఖ అప్రమత్తమైంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో చేరిన విద్యార్థులకు సంసిద్ధత (రెడీనెస్) కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభమైన తరువాత 'సంసిద్ధత' కార్యక్రమం పేరిట లాంగ్వేజస్, నాన్ లాంగ్వేజస్ పుస్తకాలు అందజేశారు. గత నెల నుంచి ఇప్పటివరకూ (40 రోజులపాటు) ప్రతిరోజూ ఆరో తరగతి విద్యార్థులకు సంసిద్ధత పుస్తకాలపైనే బోధన చేస్తున్నారు. విశాఖ జిల్లాలో 112 యూపీ, ఉన్నత పాఠశాలల్లో సుమారు పది వేల మంది పిల్లలు ఆరో తరగతిలో చేరారు. తరగతిలో ప్రవేశం పొందిన రోజు నుంచి ఇప్పటివరకూ ఆరో తరగతి సిలబస్ బోధన చేయడం లేదు. దాని స్థానంలో ప్రభుత్వం ముద్రించిన సంసిద్ధత కార్యక్రమం పుస్తకాల్లో పాఠాలు చెబుతున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సిలబస్ మేరకు ఈ పుస్తకాలు రూపొందించారు. జిల్లాలో ఆరో తరగతిలో సుమారు 60 శాతం విద్యార్థులు సామర్థ్యం కంటే తక్కువలో ఉన్నారనే విషయం గుర్తించారు. తెలుగులో వర్ణమాల, ఇంగ్లీష్‌లో ఎ.బీ.సీ.డీ నుంచి పదాలు వరకు, గణితంలో ఎక్కాలు నుంచి కూడికలు, తీసివేతలు, చిన్నపాటి లెక్కలు బోధిస్తున్నారు. సంసిద్ధత పుస్తకాలపై పట్టు వచ్చేలా టీచర్లకు షెడ్యూల్ ఇచ్చారు. 40 రోజుల బోధన తరువాత వచ్చే నెల నాలుగు నుంచి ఆరో తేదీ వరకు ఆరో తరగతి విద్యార్థులకు సంసిద్ధత పుస్తకాలపైనే మాత్రమే పరీక్షలు (ఎఫ్ఎ-1) నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు ముగిసిన తరువాతే ఆరోతరగతి సిలబస్ బోధన చేస్తారు.

వైద్యుల కొరత

... 5వ పేజీ తరువాయి

పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 280 మంజూరు కాగా, ప్రస్తుతం 252 మంది పనిచేస్తున్నారు. మరో 28 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవన్నీ, పదేళ్ల కిందట మంజూరైన పోస్టులు. పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులను పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. కీలక విభాగాల్లో యూనిట్ల సంఖ్యను పెంచాల్సి ఉందని, యూనిట్లు పెరిగితే ప్రొఫెసర్, ఇతర కేడర్ పోస్టులు పెరుగుతాయని నిపుణులు చెబు తున్నారు.

పదోన్నతుల కోసం నిరీక్షణ

అసోసియేట్ ప్రొఫెసర్ నుంచి ప్రొఫెసర్ పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న వైద్యుల సంఖ్య భారీగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 250 మందికిపైగా ఎదురుచూస్తుంటే, ఉత్తరాంధ్రలో సుమారు 70 మందికిపైగా ప్రొఫెసర్ పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రమోషన్స్ ఇచ్చేందుకు ఇప్పటికే ప్రభుత్వం సిద్ధమైంది. కౌన్సిలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే, ఇందులో ఎంత మందికి అవకాశం దక్కుతుందో చూడాల్సి ఉంది. సాధారణంగా మూడేళ్లపాటు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేసినవాళ్లు ప్రొఫెసర్ పదోన్నతికి అర్హులు. కానీ, ప్రస్తుతం వన్‌టైమ్ ప్రమోషన్ కోసం ఏడాది సీనియారిటీ ఉన్న వారిని కూడా కౌన్సెలింగ్‌కు పిలుస్తున్నట్టు చెబుతున్నారు. పదేళ్ల నుంచి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న ఎంతో మంది తమకు చివరి దశలో అయినా ప్రొఫెసర్‌గా పదోన్నతి లభిస్తుందా.? లేదా.? అన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.

దేవుడి పేరిట వ్యాపారం!

... 5వ పేజీ తరువాయి

మీడియాలో ఆహ్వాన పత్రికను తెగ వైరల్ చేస్తున్నారు.

అనుమతులు ఇంకా ఇవ్వలేదు

బీచ్‌రోడ్డులో హార్బర్ పార్క్ ఏరియాలోని ఏపీఐఐసీకి చెందిన ఆ 13.43 ఎకరాల స్థలాన్ని ఇటీవలె రాష్ట్ర ప్రభుత్వం లులూ మాల్‌కు కేటాయించింది. భారీ షాపింగ్ మాల్ నిర్మాణానికి 99 ఏళ్లకు లీజుకు ఇచ్చింది. అయితే 'యూత్ ఐకాన్' పేరుతో ఆహ్వాన పత్రిక ముద్రించిన సదరు యువకుడు వినాయ చవితి ఉత్సవాలకు ఆ భూమిని కేటాయించాలని ఏపీఐఐసీ అధికారులకు దరఖాస్తు చేశాడు. నగరంలోని ఇద్దరు ఎమ్మెల్యేలతో సిఫారసు కూడా చేయించాడు. ఇద్దరు సిఫారసు చేయడంతో ఏపీఐఐసీ అధికారులు అనుమతి ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది. వినాయక చవితి ఇంకా నెల రోజులు ఉంది కాబట్టి దరఖాస్తును పరిశీలనలో పెట్టారు. వచ్చిన వ్యక్తికి పరిస్థితిని కూడా వివరించారు. ఆ భూమిని లులూ మాల్‌కు ఇచ్చేశారని, ఆ సంస్థకు చెందిన ప్రతినిధులు ఎవరైనా వస్తే తక్షణమే ఖాళీ చేయాల్సి ఉంటుందని చెప్పారు. అవన్నీ తాను చూసుకుంటానని దరఖాస్తుదారుడు బదులిచ్చాడు. అధికారులు అనుమతులు ఇవ్వకముందే కర్రపూజను బుధవారం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

పెదగంట్యాడ నుంచి వచ్చి చేయాల్సిన అవసరం ఏమిటి?

వినాయక చవితి ఉత్సవాలు వీధివీధినా చేస్తారు. అతను పెదగంట్యాడ నుంచి విశాఖపట్నం వచ్చి 13.43 ఎకరాల విస్తీర్ణంలో నిర్వహించాల్సిన అవసరం ఏమిటి?, దీనికి అవసరమైన నిధులు ఎక్కడ నుంచి తెస్తారు?...అనేది ఆలోచిస్తే...ఉత్సవం వెనుక మతలబు అర్థమవుతుంది. దేశమంతా వినాయక చవితిని నవరాత్రులు అంటే తొమ్మిది రోజులు నిర్వహిస్తే గాజువాక ముఠాలు మాత్రం నెల రోజులు చేస్తున్నాయి. కొన్నేళ్లుగా అదే జరుగుతోంది. వినాయక చవితి అని పెద్ద మైదానంలో భారీ విగ్రహం పెట్టి, దానిని చూడడానికి, పూజలకు వేర్వేరుగా టికెట్లు, దక్షిణకు హుండీలు పెట్టి దండుకోవడం అలవాటుగా మారింది. అక్కడితో ఆగకుండా ఆ ప్రాంగణంలో జాతరలా పలు వ్యాపారాలు నిర్వహించుకోవడానికి దుకాణాలు, జెయింట్ వీల్ వంటివి పెట్టి, వారి నుంచి లక్షల రూపాయల్లో అడ్వాన్సులు, అద్దెలు వసూలు చేస్తున్నారు.

అధికారులు ఆలోచించాలి?

వ్యాపార ధోరణితో ఉత్సవాలు చేసే వారికి అనుమతులు ఇచ్చే ముందు అధికారులు బాగా ఆలోచించాలి. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎవరైనా సరే వినాయక ఉత్సవాలు తొమ్మిది రోజులతో ముగించాలని స్పష్టంచేయాలి. ఆయా ప్రాంగణాల్లో వ్యాపారాలు నిర్వహించకూడదనే నిబంధన పెట్టాలి. ఏదైనా ప్రమాదం జరిగితే నివారించడానికి తగిన ఏర్పాట్లు ఉండేలా చూడాలి. ముఖ్యంగా టిక్కెట్లు పెట్టి డబ్బులు వసూలు చేయకూడదని ఆంక్షలు పెట్టాలి.

నాయకులూ తస్మాత్ జాగ్రత్త

'కుర్రాళ్లు ఏదో చేసుకుంటామని ఉత్సాహపడుతున్నారు' అని ప్రజాప్రతినిధులు వెనుకాముందు చూడకుండా సిఫారసు చేస్తున్నారు. అదే కొంప ముంచుతోంది. వారి పేర్లు చెప్పి నిర్వాహకులు నగరంలో వ్యాపారులు, పారిశ్రామికవేత్తల నుంచి భారీగా చందాలు దండేస్తున్నారు. ఎగ్జిబిషన్ పెట్టి వ్యాపారాలు చేస్తున్నారు. హిందూ పండగలను ఈవెంట్లుగా మార్చుకొని లాభపడాలని చూస్తున్నారు. ఇటువంటి వారికి దూరంగా ఉండడం, సిఫారసులు చేయకపోవడం నాయకులకు అన్నివిధాలా శ్రేయస్కరం. వద్దంటే...ఒక్కరితో పోతుంది. ఏదైనాజరిగితే నియోజకవర్గంలో పరువుపోతుంది.



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

సీఐటీయూ నేత జగ్గునాయుడు

గాజువాక, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రజలందరూ వ్యతిరేకించాలని సీఐటీయూ నాయకుడు ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గాజువాకలోని సీఐటీయూ కార్యాలయంలో వామపక్ష, వివిధ ప్రజా సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలను మరింత ఇబ్బందులకు గురి చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీల మోతను ప్రజలు భరించలేకపోతున్నారని వాపోయారు. స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వనజాక్షి, అచ్యుతరావు, జి.ఆనంద్, దుర్గారావు, రాంబాబు, లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళగౌరీ వ్రతం

అగనంపూడి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక బొర్రమాంబ పారాయణ సమితి ఆధ్వర్యంలో శ్రావణ మాస మొదటి మంగళవారం సందర్భంగా మంగళగౌరీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బొర్రమాంబకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అనాథలకు అల్పాహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కరణం పైడిరాజు, పూర్ణానందశర్మ, గల్లా రాజు, చిత్తా గణేశ్, రామారావు, పారాయణ సమితి ప్రతినిధులు జానకీదేవి, లలితకుమారి, శోభారాణి, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

70వ వార్డులో 'తొలి అడుగు'

కూర్మన్నపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డులో టీడీపీ నాయకులు మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు చట్టి గోపి, కేవీఎస్ శంకరరావు, తదితరులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు పీఎంఎల్ నాయుడు, పీబీఎల్ మూర్తి, ఎంఎస్ఎన్ రాజు, శ్రీనివాస్, నూకరాజు, రామకృష్ణ, ఎస్.రాజా, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

యోగా టీషర్టుల పంపిణీ

పెదగంట్యాడ, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించేందుకు నిత్యం పారిశుధ్య కార్మికులు పరిశ్రమిస్తుంటారని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అన్నారు. పారిశుధ్య కార్మికులు వారానికి ఒకరోజు యోగాలో పాల్గొనాలని సూచిస్తూ ప్రభుత్వమిచ్చిన యోగా టీషర్టులను మంగళవారం సాయంత్రం వారికి పంపిణీ చేశారు. వికాస్‌నగర్ రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కోరుకునే పారిశుధ్య కార్మికులు కూడా ఆరోగ్యవంతంగా ఉండేందుకు తప్పనిసరిగా యోగా చేయాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు రట్టి వాసు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీ వెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)

● **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

● **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 48, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 36, పచ్చిమిర్చి 68, కాకరకాయలు 28, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజీ 20, క్యారెట్ 44, దొండకాయలు 32, బంగాళదుంపలు 16, అరటికాయ (పె) 10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 66, బరబాటి40, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ(పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 72, కీరదోస 30, క్యాప్సికమ్ 72, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 42, గోరుచిక్కుడు 42, దేముడుచిక్కుడు 40, కూరపెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, కర్రపెండలం 24, మామిడిఅల్లం 56, బూడిద గుమ్మడికాయ 20, బొప్పాయి 36, జామకాయలు(కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

అరుంధతికి ఇదేం దుస్థితి!

నాడు పంట పొలాలకు పుష్కలంగా నీరందించిన చెరువు నేడు తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతున్న వైనం

భరించరాని దుర్వాసనతో ఇబ్బందులకు గురువుతున్న ప్రజలు



మురుకు కూపంలా మారిన అరుంధతి చెరువు

అక్కిరెడ్డిపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నాడేమో పంట పొలాలకు నీరందించి రైతులకు బాసటగా నిలిచిన అరుంధతి చెరువు... నేడేమో మురుకు కూపంగా మారి తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతుండడం బాధాకరం. సుమారు 20 ఏళ్ల క్రితం వరకు ఇక్కడి హరిజన జగ్గయ్యపాలెం కాలనీకి ఆనుకుని ఉన్న పంట పొలాలకు పుష్కలంగా నీరందించిన అరుంధతి చెరువు ఇప్పుడు మురుకు కూపంగా తయారై అంటువ్యాధులకు నిలయంగా మారింది.

జీవీఎంసీ 69వ వార్డు పరిధి హరిజన జగ్గయ్యపాలెం కాలనీకి ఆనుకుని సుమారు పదెకరాల విస్తీర్ణంలో ఉన్న అరుంధతి చెరువు ఒకప్పుడు వ్యవసాయానికి ప్రధాన నీటి వనరుగా ఉండేది. కాలక్రమేణా ఇక్కడి వ్యవసాయ భూములలో భవనాలను నిర్మించడంతో ఈ చెరువు నిరుపయోగంగా మారింది. దీంతో చెరువుకు సంబంధించిన స్థలంలో ప్రస్తుతం కల్యాణ మండపం, రెండు క్రైస్తవ ప్రార్థన మందిరాలు, ఒక మసీదుతో పాటు విద్యుత్ సబ్ స్టేషన్‌ను నిర్మించారు. మరోవైపు హరిజన జగ్గయ్యపాలెం కాలనీకి శ్మశానవాటికను నిర్మించడంతో చెరువు పూర్తిగా కుదించుకుపోయి ఇప్పుడు కేవలం మూడెకరాలకు మాత్రమే పరిమితమైంది. ఈ చెరువులోకి ఎగువ ప్రాంతాలైన వెంకటేశ్వర కాలనీ ప్రజల వాడుక నీరుతో పాటు వర్షపు నీరు వస్తుండడంతో పాటు ముళ్లపొదలతో నిండిపోయి మురుకు కూపంగా మారింది. ప్రస్తుతం చెరువు నుంచి వచ్చే తీవ్ర దుర్గంధం వల్ల శ్మశానవాటికకు వచ్చే వారితో పాటు ప్రార్థనా మందిరాలకు వచ్చే ప్రజలు, ప్రధాన రోడ్లపై రాకపోకలు సాగించేవారంతా ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే ముక్కు ముసుకోవాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. దీనికితోడు ఈ చెరువు వల్ల అంటువ్యాధులు ప్రబలుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అరుంధతి చెరువులోకి మురుగు నీరు రాకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని హరిజన జగ్గయ్యపాలెం కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి

-గుమ్మడి రామాంజనేయులు, అధ్యక్షుడు, హరిజన జగ్గయ్యపాలెం



షీలానగర్ ప్రధాన రహదారికి ఆనుకుని అవుట్‌లెట్ నిర్మించి వెంకటేశ్వరకాలనీకి చెందిన వాడుక నీటిని జాతీయ రహదారిపై ఉన్న అవుట్‌లెట్‌కు కలపాలని ఎన్నో ఏళ్లుగా అధికారులకు విన్నవిస్తున్నా ఫలితం లేకపోవడంతో అరుంధతి చెరువు పూర్తిగా కలుషితమైంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి చెరువులోని మురుగు నీటి తొలగింపునకు చర్యలు చేపట్టడంతో ఈ స్థలాన్ని కాలనీ అభివృద్ధి పనులకు వినియోగించాలి.

సురక్షిత ప్రయాణం కోసమే ప్రీపెయిడ్ ఆటో స్టాండ్

- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి
- దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద ప్రారంభం



ప్రీపెయిడ్ ఆటో స్టాండ్‌ను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

కూర్మన్నపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ప్రీపెయిడ్ ఆటో స్టాండ్‌ను ఏర్పాటు చేసినట్టు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. దువ్వాడ రైల్వేయూజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్లాట్‌ఫారం నంబర్-4 వద్ద ఏర్పాటు చేసిన ప్రీపెయిడ్ ఆటో స్టాండ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాత్రి వేళల్లో రైళ్ల దిగే ప్రయాణికులు ఇక్కడనుంచి ఆటోల్లో తమ ప్రాంతాలకు వెళ్లేందుకు భయపడాల్సి వస్తుందన్నారు. ఇకపై భయపడాల్సిన అవసరం లేకుండా జీపీఎస్‌లతో కూడిన ఆటోలు ఇక్కడి ఆటోస్టాండ్‌లో నిరంతరం ఉంటాయని పేర్కొన్నారు. ఆర్టీఏ నిర్దేశించిన మేరకే ఆటో చార్జీలు ఉంటాయన్నారు. ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులను కూడా అందజేస్తున్నామని, ప్రతి ఆటోలో, ఆటో స్టాండ్ వద్ద పోలీస్‌స్టేషన్ల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంటాయని, ప్రయాణికులకు ఎటువంటి సమస్య తలెత్తినా తక్షణమే ఫోన చేయాలని సీపీ సూచించారు. డీఆర్ఎం డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ ఈ ఆటో స్టాండ్‌కు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రయాణికుల భద్రతకు రైల్వే మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని పేర్కొన్నారు. దువ్వాడ రైల్వే స్టేషన్‌ను మరింతగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

వైద్యుల సలహా మేరకే యాంటీ బయాటిక్స్ వాడాలి

అగనంపూడి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వైద్యుల సలహా మేరకు మాత్రమే యాంటీ బయాటిక్స్‌ను వినియోగించాలని జిల్లా ఔషధ నియంత్రణ సహాయ సంచాలకులు ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ విద్యార్థులకు యాంటీ బయాటిక్స్ వాడకంపై మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యాంటీ బయాటిక్స్ కేవలం అర్హత ఉన్న వైద్యుల సూచన మేరకే వాడాలని పేర్కొన్నారు. దగ్గు, జలుబు, వైరల్ ఇన్ఫెక్షన్లకు యాంటీ బయాటిక్స్ వాడరాదన్నారు. ఔషధ నియంత్రణ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరూ సురక్షితమైన ఆహారంతో పాటు శుద్ధమైన నీటినీ తీసుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే తక్షణమే వైద్యులను సంప్రదించాలన్నారు. ఔషధ నియంత్రణ అధికారులు అభిప్రియ, కె.కల్యాణి, కేవీ భారతి, ఎస్.కల్యాణి, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

గాజువాక, జూలై 29 (ఆంధ్రజ్యోతి): చినగంట్యాడ ఫీడర్ పరిధిలో మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా ఈ నెల 31వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ టీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా కోర్టు ప్రాంగణం, జీవీఎంసీ, తహశీల్దార్ కార్యాలయ ప్రాంతాలు, ఆర్కే ఆస్పత్రి ఏరియా, చినగంట్యాడ, ఎస్సీ కాలనీ, శ్రామికనగర్, యర్రగడ్డ కాలనీ, శ్రీనివాసనగర్, దత్తసాయినగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఘనంగా ఎంపీ భరత్ జన్మదిన వేడుక

గోపాలపట్నం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎంపీ శ్రీభరత్ జన్మదినోత్సవాన్ని గోపాలపట్నంలో టీడీపీ కార్యకర్తలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పాల్గొని కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు.

పెందుర్తి డీటీ బదిలీ

పెందుర్తి, జూలై 29(ఆంధ్రజ్యోతి): పెందుర్తి డిప్యూటీ తహశీల్దార్ (డీటీ) ఏడిద సంతోశ్ కిరణ్ స్టీల్‌ప్లాంట్ ఎస్‌డీసీ డీటీగా బదిలీ అయ్యారు. కొంత కాలం క్రితం సంతోశ్‌కిరణ్‌ను పెందుర్తి తహశీల్దార్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన విషయం విదితమే. త్వరలోనే వెంకటప్పారావు పెందుర్తి తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

కొనసాగిన భూ పత్రాల పరిశీలన

వేపగుంట, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎంఆర్‌డీఏ భూ వివాదానికి సంబంధించిన రైతుల భూ పత్రాల పరిశీలన కార్యక్రమం మంగళవారం ప్రారంభమయింది. పత్రాల పరిశీలనకు అధిక సమయం పడుతుండడంతో మరో రెండు రోజులు పొడిగించామని, బుధవారం ఆఖరు రోజని డీటీ భారతి పేర్కొన్నారు. మిగిలిన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

యూటీఎఫ్‌లో పలువురి చేరిక

మల్కాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి నిజాయితీగా పనిచేసే యూటీఎఫ్‌లో సభ్యులుగా చేరడం గర్వకారణంగా ఉన్నదని నగరపాలక సంస్థలోని ఉపాధ్యాయులు అన్నారు. యూటీఎఫ్ ములగాడ శాఖ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే సత్తా యూటీఎఫ్‌కు ఉన్నదని అన్నారు. ఈ సందర్భంగా నూతన యూటీఎఫ్ సభ్యులను సంఘంలోని మిగతా సభ్యులు ఘనంగా స్వాగతించారు. యూటీఎఫ్‌లో వ్యక్తిగత విషయాలకు చోటు లేదని సమిష్ఠ నిర్ణయాలు కీలక పాత్ర పోషిస్తాయని, ఐక్యంగా కలిసి సంఘాన్ని అభివృద్ధి చేసుకుంటూ, ప్రభుత్వ పాఠశాల విద్యారంగాన్ని కాపాడుకోవాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు.

నూతన కార్యవర్గం

గౌరవఅధ్యక్షుడిగా ఎస్ఎన్ బాషా, అధ్యక్షుడిగా వి.కన్నబాబు, సహాధ్యక్షుడిగా పి.కృష్ణకిశోర్, సహాధ్యక్షురాలుగా ఎం.విక్టోరియారాణి, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌వీఎన్.సత్యనారాయణ, కోశాధికారిగా జె.గణేశ్వరరావు, కార్యదర్శులుగా ఎన్.మూర్తి, కె.సత్యనారాయణ తదిరులను ఎన్నుకున్నారు.

ఘనంగా 'అయితి' ప్రమాణ స్వీకారం



పీఏసీఎస్ చైర్మన్ అయితి సింహాచలాన్ని సత్కరిస్తున్న పంచకర్ల, తదితరులు

పెందుర్తి, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)ఛైర్మన్‌గా అయితి సింహాచలం పీఏసీఎస్ కార్యలయంలోని ఎమ్మెల్యే పంచకర్ల ఆధ్వర్యంలో మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం చిరికి అవతారం, ఉగ్గిన అచ్చిబాబు డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీరించారు. రైతులకు వ్యవసాయ రుణాలను ఛైర్మన్ అందజేశారు. ఈ సందర్భంగా పీఏసీ ఎస్ కార్యాలయం నుంచి పెందుర్తిలోని తాండ్రపా పారా యుడు భవన్‌కు ర్యాలీగా వెళ్లారు. అక్కడ నిర్వహించిన ప్రమాణ స్వీకార సభలో ఛైర్మన్ సింహాచలాన్ని ఎమ్మెల్యే పంచకర్ల శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో అనుభవంతో ఎన్నో పదవులు నిర్వహించారని కొనియాడారు. రైతులకు సకాలంలో రుణాలు అందజేసే పీఏసీఎస్ పరపతి పెంచాలని కోరారు. ఈ సందర్భంగా అయితి సింహాచలాన్ని అభిమానులు, కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ అధ్యక్షుడు కోన తాతారావు, సింగబల్లి భక్తిమాల, గొలగాని కనకరాజు, మూలమల్ల నర్సింగరావు, సదరం భీమేశ్వరావు, గొల్లవిల్లి గణేశ్, కరణ స్వామి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వేగి దివాకర్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డి నారాయణరావు, బీజేపీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, సేనాపతి సోమ శేఖర్, పిన్నింటి వరలక్ష్మి, డీబీఎల్ నాయుడు, ఆర్ఎస్ నాయుడు పాల్గొన్నారు.

చిరికి అవతారానికి గండి బాబ్జీ సత్కారం

పెందుర్తి (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చిరికి అవతారాన్ని టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ టీడీపీ కార్యలయంలో శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ యువజన నేత గండి వంశీదీప్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు భూగర్భ విద్యుత్ కేబుల్ వైర్లు



భూగర్భ విద్యుత్ కేబుల్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ఆర్పీపేట,(కంచరపాలెం),జూలై 29(ఆంధ్రజ్యోతి): విదేశాల తరహాలో నగరంలో కూడా భూగర్భ విద్యుత్ కేబుల్ వైర్ల పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుందని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. జీవీఎంసీ 56వ వార్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ భూగర్భ వైర్ల పనులకు గణబాబు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో విద్యుత్ రంగంలో అనేక సంస్కరణలు తీసుకురావడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. దీనిలో భాగంగా పశ్చిమ నియోజకవర్గంలో రూ.1.28 కోట్ల నిధులతో పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడా కూడా బయటకు కనిపించకుండా విద్యుత్ సరఫరా జరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సోలార్ వినియోగంతో విద్యుత్ ఆదా

సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా విద్యుత్ ఆదాతో పాటు పరిసరాల కాలుష్యం కూడా తగ్గుతుందని ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 56, 57 వార్డుల ప్రజలకు ప్రధాని మంత్రి సూర్యఘర్ యోజన కార్యక్రమంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీ, లోను సదుపాయం కల్పిస్తోందన్నారు. మెరుగైన విద్యుత్ కోసం ప్రతి ఒక్కరు సోలార్ విద్యుత్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

పీఎం శ్రీ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన విద్య అందించడమే పీఎం శ్రీ పాఠశాలల ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పంచకర్ల అన్నారు. ఈ సదర్భంగా మంగళవారం పెందుర్తిలోని పీఎం శ్రీ పాఠశాలలో రూ.28 లక్షల అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యాస విధానాన్ని వర్చువల్‌గా పంచకర్ల సమీక్షించారు. జిల్లాలోనే పీఎంశ్రీ పాఠశాలల్లో ఉత్తమ పాఠశాలగా ఎంపికైనందుకు అధ్యాపక సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈవో ప్రేమ్‌కుమార్, ఆర్‌జీడీ భాస్కరరావు, పాఠశాల హెచ్‌ఎం పాల్గొన్నారు.

ఎగ్ కార్ట్ కౌంటర్లు ప్రారంభం

స్థానిక మహిళా ప్రగతి కేంద్రంలో నెక్ ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధి కోసం ఏర్పాటుచేసిన రెండు ఎగ్ కార్ట్ కౌంటర్లను ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ప్రారంభించారు. ఈ క్రమంలో పినగాడి, సరిపల్లి చెందిన ఇద్దరు మహిళలు చెరో రూ 50 వేలతో ఏర్పాటుచేసిన ఎగ్ కార్ట్‌లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎగ్ కార్ట్‌లు మహిళల ఆర్థిక వృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

రాష్ట్ర ప్రగతిని వైసీపీ జీర్ణించుకోలేకపోతోంది

టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రగతిని చూసి వైసీపీ జీర్ణించుకోలేకపోతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలనలో ప్రజలంతా ఆనందంగా ఉన్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు పల్లా రమణ, రాజాన రాజు, విల్లా రామ్మోహన్‌కుమార్, అనంతలక్ష్మి, రట్టి వాసు, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి కాపాడాలని 'పల్లా'కు వినతి

అక్కిరెడ్డిపాలెం: మింది, అక్కిరెడ్డిపాలెం, పంచవటి కాలనీలను ఆనుకుని ఉన్న విశాఖ పోర్టు స్థలంలో కాలుష్య కారక సంస్థల ఏర్పాటును విరమించుకునేలా చర్యలు చేపట్టాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు 68వ వార్డుకు చెందిన అఖిలపక్ష కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో వారు పల్లాను కలిసి డాక్‌యార్డు రహదారిలో గల విశాఖ పోర్టు స్థలాన్ని బీపీసీఎల్‌కు కేటాయించడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే విశాఖ డెయిరీ కాలుష్యంతో పలు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు బీపీసీఎల్ గొడౌన్ల ఏర్పాటు వల్ల సమస్య మరింత తీవ్రతరం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని వేడుకున్నారు. పల్లాను కలిసిన వారిలో నాయకులు పి.చిన్నారావు, సర్వసిద్ధి అనంతలక్ష్మి, జి.నరసింహమూర్తి, ఏకే పాత్రో, ఎ.మురళీకృష్ణ, విశ్వనాథం, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ శ్రీభరత్ జన్మదిన వేడుకలు



86వ వార్డులో కేక్ కట్ చేసిన నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ఎం.శ్రీభరత్ జన్మదిన వేడుకలను మంగళవారం టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. విశాఖకు పరిశ్రమలను తీసుకువచ్చేందుకు ఎంపీ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నాయకులు వేగుంట శ్రీనివాస్, జగదీశ్, రమేశ్, గణపతి, నాగార్జున, లోకేశ్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగపంచమి పూజలు

పెదగంట్యాడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నాగపంచమిని పురస్కరించుకుని మంగళవారం నెల్లిముక్కు రామాలయ ఆవరణలో గల శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. వేకువజాము నుంచే భక్తులు తరలివచ్చి నాగదేవతలకు పంచామృత, క్షీరాభిషేకాలను చేశారు. అర్చకుడు వెంకటేశ్‌శర్మ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలను చేపట్టారు.

ఉత్తమ బోధనకు చిరునామాగా కేవీలు

- పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

ఆర్పీపేట,(కంచరపాలెం),జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆదర్శవంతమైన బోధనకు కేంద్రీయ విద్యాలయాలు నిదర్శనంగా నిలుస్తున్నాయని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. నూతన విద్యావిధానం 2020 అమలై 5 సంవత్సరాలు పూర్తిచేసుకన్న సందర్భగా పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన స్థానిక కేంద్రీయ విద్యాలయం-1ను మంగళవారం జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి స్థానిక కేవీ-1 పీఎం శ్రీ కేవీగా గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. ఉత్తమ బోధనకు కేవీలు చిరునామాగా మారాయన్నారు. ప్రిన్సిపాల్ జి. కిశోర్ విద్యాలయంలో అందిస్తున్న బోధనా విధానాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం అండర్-14 హ్యాండ్ బాల్ క్రీడ జాతీయ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, స్థానిక నాయుకులు పాల్గొన్నారు.

చురుగ్గా వెంకటాపురం రహదారి నిర్మాణం



నిర్మాణంలో ఉన్న కొత్తపాలెం-వెంకటాపురం రహదారి

గోపాలపట్నం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లగా ప్రతిపాదనలకే పరిమితమైన కొత్తపాలెం, వెంకటాపురం రహదారి నిర్మాణం ఎట్టకేలకు కార్యరూపం దాల్చి, పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ రహదారి పూర్తయితే జెర్రిపోతులపాలెం, చింతగుట్ల తరిదర గ్రామాల ప్రజలు కూడా ఈ మార్గం నంచి గోపాటపట్నం బీఆర్‌టీఎస్‌కు చేరుకోవచ్చు. ఈ రహదారి నిర్మాణంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఐదుమదాల మార్గంలో రహదారి నిర్మిస్తే మరింత సౌకర్యం

కొత్తపాలెం నుంచి వెంకటాపురం గ్రామానాకి వెళ్లాలంటే మధ్యలో రైల్వే అండర్‌పాస్ ఉంది. కానీ ఈ అండర్‌పాస్‌వే వద్ద రహదారి నిర్మాణం జరగడం లేదు. సాధారణ రోజుల్లో రాకపోకలు సాగించేందుకు బాగానే ఉన్నా, వర్షం కురిస్తే అటునుంచి రావాలంటే నరకం చూడాల్సిందేనని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా అండర్‌పాస్‌వే వద్ద కూడా కొత్త రోడ్డు వేస్తే మరింత సౌకర్యంగా ఉంటుందని స్థానికుల అభిప్రాయపడు తున్నారు.

వారి సేవలు మరువలేనివి: హెచ్‌ఎం కమలకుమారి

వేపగుంట, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులకు మంగళవారం సన్మానం చేసి, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఉపాధ్యాయులు సేవలను కొనియాడారు. బదిలీఅయిన ఉపాధ్యాయులను స్థానిక బాలాజీ హోటల్ అధినేత ఎ.వెంకటరమణ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకులంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ పర్యటన



పాఠశాల యాజమాన్యంతో మాట్లాడుతున్న సబ్బవరపు గణేశ్

గోపాలపట్నం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మేఘాద్రిగెడ్డ ప్రాంతంలోని డా.బిఆర్ గురుకుల పాఠశాలలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేశ్ మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని, విద్యార్థుల వసతి గృహాల ను, పరిసరాల పరిశుభ్రతలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. పాఠశాలలోని మరమ్మతులకు నిధలు సమికరిస్తానని హామీ ఇచ్చారు.

విశాఖ స్కేటర్లకు పతకాలు

» గ్రీష్మకు స్వర్ణం, దినేష్, క్షేత్రకు రజతం



పసిడి పతకం సాధించిన దొంతర గ్రీష్మ

విశాఖపట్నం స్పోర్ట్సు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కొరియాలో జరిగిన 20 ఏషియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన నగర స్కేటర్లు పతకాల పంట పండించారు. ఈ టోర్నీ షో గ్రూప్ ఈవెంట్‌లో దొంతర గ్రీష్మ అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించి స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. ఫ్రీ స్టైల్ ఈవెంట్‌లో గాయంతో బరిలోకి దిగిన గ్రీష్మ... ఆశించిన స్థాయికన్నా అద్భుతంగా రాణించి ఆరో స్థానంలో నిలవడం విశేషం. ఈ టోర్నీలో గొలగాని దినేష్ పెయిర్ డ్యాన్స్‌లో రెండు రజత పతకాలు సొంతం చేసుకోగా, శివకోటి క్షేత్ర పెయిర్ డ్యాన్స్‌లో రజత పతకం సాధించింది. జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన పి.సత్యనారాయణ (సత్యం) విశాఖకు చెందినవారు కావడం విశేషం. ప్రతిష్ఠాత్మక టోర్నీలో దేశానికి పతకాలు అందించిన గ్రీష్మ, దినేష్, క్షేత్రలు శివాజీ పార్కులోని ఆర్కిస్టిక్ రింక్‌లో సత్యనారాయణ, చిట్టిబాబు, ఆదేశ్‌సింగ్‌ల వద్ద శిక్షణ పొందుతూ అంతర్జాతీయ పతకాలు సాధించే దిశగా సాధన చేస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగం పేరిట రూ.10 లక్షల వసూలు

నిందితుడ్ని అరెస్టు చేసిన పోలీసులు

సీతంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి రూ.లక్షల్లో డబ్బు వసూలు చేసి మోసగించిన వ్యక్తిని నాలుగో పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అక్కయ్యపాలెంకి చెందిన వేపాడ పవన్‌కుమార్‌కు తన ఇంటి వెనుక ఉన్న ఓ టీవీ చానల్‌కి చెందిన సంజయ్ శ్రీనివాసరెడ్డి, అతని భార్య శైలజరెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్ నర్స్‌గా ఉద్యోగాలు చేస్తున్నట్టు పరిచయం చేసుకున్నారు. చాలా మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పించామని నమ్మించి ఒక లేఖ చూపించారు. అదే విధంగా తనకు ప్రభుత్వ ఉద్యోగం వేయిస్తామని నమ్మించారు. ఇలా నమ్మించి ఫోను పే ద్వారా రూ.8 లక్షలు వేయించుకున్నారు. దీంతో పాటు వారి వద్ద మరో రూ.2 లక్షల చీటీ కూడా కట్టాడు. ఆ డబ్బు కూడా ఉద్యోగం కోసం జమ చేస్తానని సంజయ్ శ్రీనివాసరెడ్డి నమ్మించాడు. అంతేకాకుండా ఉద్యోగానికి మరో రూ.2 లక్షలు ఇవ్వాలని చెప్పడంతో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించిన తర్వాత ఇస్తానని పవన్ కుమార్ అతడికి తెలిపాడు.

అప్పటి నుంచి ఉద్యోగం ఇప్పించకుండా, డబ్బులు ఇవ్వకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించి పీఎల్‌సీఎఫ్‌కు ఫిర్యాదు చేశాడు. వారు ఇద్దరిని పిలిపించి మాట్లాడారు. వారి వద్ద డబ్బులు ఇస్తానని చెప్పి సంజయ్ శ్రీనివాసరెడ్డి తప్పించుకొని తిరుగుతున్నాడు. ఆదివారం సాయంత్రం అతడు కనిపించడంతో పవన్‌కుమార్ డబ్బులు అడిగాడు. ఇచ్చేదిలేదనడంతో ఈ నెల 28న నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో సంజయ్ శ్రీనివాస రెడ్డి, అతని భార్య శైలజరెడ్డిలపై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ ఎ.సత్యనారాయణ విచారణ అనంతరం మంగళవారం సంజయ్ శ్రీనివాసరెడ్డిని అరెస్టు చేశారు.

ఇలా తవ్వి పోస్తే... నవ్వి పోరా?

» ఇష్టానుసారంగా రోడ్ల తవ్వకాలు

» తిరిగి పూడ్చే చర్యలు శూన్యం

» పట్టించుకోని కాంట్రాక్టర్లు

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎవరికి నచ్చినట్టు వారు రహదారులను తవ్వేస్తున్నారు. గోతులను తిరిగి పూడ్చడం లేదు. ఎవరు.. ఎందుకు తవ్వుతున్నారో తెలియదు. ఏ వార్డుకు వెళ్లినా రహదారులన్నీ గోతులమయమే. అధికారులు కనీసం పట్టించుకోవడంలేదు. సంబంధిత కాంట్రాక్టర్లకు చెప్పి వాటిని బాగు చేయించడం లేదు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టనట్టు ఉంటున్నారు. రెండు నెలలుగా జాతీయ రహదారి వెంబడి అడుగు లోతున గొయ్యి తవ్వి విద్యుత్ కేబుల్ వేస్తున్నారు. వీధి దీపాల నిర్వహణ కోసం జీవీఎంసీ ఈ పనులు చేస్తున్నదని అధికారులు చెబుతున్నారు. గోతులు తవ్వి నెలలు అయినా వాటిని అలానే వదిలేస్తున్నారు. అందులో కేబుల్ వేయడం లేదు. కొన్ని చోట్ల కేబుల్ వేసినా గోతులను పూడ్చడం లేదు. ఈ వ్యవహారంలో అధికారులు ఒక్కో చోట ఒక్కో విధంగా వ్యవహరిస్తున్నారు. సీతమ్మధారలో స్థానిక ఎమ్మెల్యే ఉంటున్న ప్రాంతంలో గోతులు తవ్వి రెండు రోజుల్లో వాటిని సిమెంట్‌తో పూడ్చారు. కానీ సత్యంజంక్షన్ నుంచి మద్దిలపాలెం డిపో వరకు గోతులు తవ్వి రెండు నెలలైనా, కేబుల్ వేసి రెండు వారాలైనా గోతులు పూడ్చలేదు. తాజాగా అక్కయ్యపాలెం హైవేలో నరసింహనగర్ రైతుబజారుకు వెళ్లే రహదారిని తవ్వేశారు. ఇక్కడ ఎక్కువగా తవ్వేయడం వల్ల రాకపోకలు సాగించే వాహన చోదకులు మంగళవారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ కేబుళ్లకే కాకుండా వీధుల్లో యూజీడీ కనెక్షన్ల కోసం, వాటర్ పైపులైన్ల పనుల కోసం ఇష్టానుసారం తవ్వి వదిలేశారు. వాటిని నెలలు కావస్తున్నా బాగు చేయడం లేదు. యుద్ధ ప్రాతిపదికన గోతులను పూడ్చేలా జీవీఎంసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.




నరసింహనగర్ రైతుబజారుకు వెళ్లే మార్గంలో జాతీయ రహదారిని తవ్వేయడంతో వాహన చోదకుల పాట్లు



మద్దిపాలెం ఆర్టీసీ బస్సు డిపో పక్కన తవ్విన గోతులు

ఘనంగా ఎంపీ శ్రీభరత్ జన్మదిన వేడుకలు

మహారాణిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా పార్టీ నాయకులు కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ విశాఖ ప్రజలు అత్యధిక మెజారిటీతో భరత్‌ను లోక్‌సభకు పంపగా, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అహర్నిశలు నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. విశాఖ రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్ ప్యాకేజీ ప్రకటనలు ఆయన కృషిలో భాగమేనని తెలిపారు. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, నాయకులు దువ్వారపు రామారావు, సీతంరాజు సుధాకర్, మహ్మద్ నజీర్, పొలమరశెట్టి శ్రీనివాసరావు, ఉరుకూటి డేవిడ్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావుకు కేకు తినిపిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

వీసీబీ చైర్మన్‌గా జేవీ సత్యనారాయణమూర్తి

» వైస్ చైర్మన్‌గా చలసాని రాఘవేంద్రరావు



జేవీ సత్యనారాయణమూర్తి, సీహెచ్ రాఘవేంద్రరావు

సీతంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సహకార రంగంలో గుర్తింపు తీసుకొచ్చిన 110 సంవత్సరాల విశాఖపట్నం కో-ఆపరేటివ్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. బ్యాంక్ చైర్మన్‌గా జేవీ సత్యనారాయణమూర్తి, వైస్ చైర్మన్‌గా చలసాని రాఘవేంద్రరావులను డైరెక్టరు ఎన్నుకున్నారు. సహకార ఎన్నికల అథారిటీ జిల్లా కలెక్టర్‌ను ఎన్నికల అధికారిగా నియమించడంతో జూన్ 16న నోటిఫికేషన్ జారీ చేశారు. సహకార శాఖ అధికారులు నామినేషన్లు స్వీకరించారు. ఉపసంహరణ అనంతరం అన్ని కేటగిరీలకు సంబంధించి 21 మంది మాత్రమే పోటీలో ఉండడంతో వారంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు జూలై 25న ప్రకటించారు. ఈ మేరకు డైరక్టర్లంతా మంగళవారం జేవీ సత్యనారాయణ మూర్తిని చైర్మన్‌గా, చలసాని రాఘవేంద్రరావును వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాలకవర్గాన్ని మాజీ చైర్మన్ మానం అంజనేయులు, ఉద్యోగుల సంఘం ప్రతినిధులు అభినందించారు.

రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

» కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి



వార్డులను తనిఖీ చేస్తున్న సూపరింటెండెంట్, ఇతర అధికారులు

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో చికిత్స పొందే రోగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని సూపరింటెండెంట్ డాక్టర్ వాణి పేర్కొన్నారు. మంగళవారం సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరితో కలిసి ఆమె పలు విభాగాలను సందర్శించారు. ఇబ్బందులు, సమస్యలను పరిశీలించి పరిష్కరించా లని అధికారులను ఆదేశించారు. క్యాజువాల్టీ సీటీ స్కాన్ మెషిన్‌లో సమస్యలు తలెత్తుతున్న అంశాన్ని పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. రోగులు ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి తిరిగి వెళ్లేంత వరకు సంతృప్తిగా వైద్య సేవలు అందేలా చూడా లన్నారు. సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ వార్డులు పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరించకూడ దన్నారు. రోగులు, వారి సహాయకులకు ఏవైనా ఇబ్బందులుంటే తమను సంప్ర దించాలన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

» జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లేపల్లి సుభద్ర



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, తదితరులు

సిరిపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా మానవ అక్రమ రవాణా పెను సమస్యలా పరిణమించడం దారుణమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లేపల్లి సుభద్ర అన్నారు. ఏపీ చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం, ఏఈటీఎస్ఏసీ ఇండియా, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, ఏపీ సీఐడీ, హెచ్‌డీటీయూ నోడల్ ఏజెన్సీ, పోలీస్ శాఖలతో పాటు ఎన్జీవో సంస్థల సమన్వయంతో రూపొందించిన 'మానవ అక్రమ రవాణా ఒక వ్యవస్థీకృత నేరం' పోస్టర్‌ను మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమ రవాణాలో పిల్లలు, మహిళలు, పేదలు, నిరక్షరాస్యులు సమిధలుగా మారుతుండడం బాధకరమన్నారు. చక్కని జీవితం, ఉద్యోగం, పెళ్లి పేరిట బోగస్ మాటలతో నమ్మించి వారి జీవితాలను ఛిద్రం చేస్తున్నారన్నారు. చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాతో పాటు బాలికల అక్రమ రవాణా వ్యవస్థను రూపు మాపేందుకు ఫోరం వివిధ శాఖలతో కలిసి పోరాడుతోందన్నారు. దీనిపై విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం ప్రతినిధులు కె.ఎల్లయ్య, బి.లవకుశ, ఎం.ప్రవీణ త్రినాథ్, బి.లక్ష్మణరావు, బి.సురేష్, ఎం.హరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో ఏకాగ్రత అవసరం: ఆర్టీసీ ఆర్ఎం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడపాలని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు సూచించారు. వాల్తేరు డిపోలో మంగళవారం డ్రైవర్ల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ డ్రైవర్లంతా మంచి అలవాట్లు కలిగి ఉండాలన్నారు. ప్రతి బస్టాపులోను బస్సును ఆపి ప్రయాణికులను బస్సు ఎక్కించి, వారిని భద్రంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఆర్టీసీపై గౌరవం పెరిగేలా వ్యవహరిస్తే, ప్రయాణికుల సంఖ్య పెరుగుతుందని అన్నారు. డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ గంగాధర్, వాల్తేరు డిపో మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ ఇంజనీర్లు నాగభూషణరావు, సుదర్శన్, నాయుడు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ హనుమశ్రీ, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

సాంకేతిక ప్రగతితోనే దేశ సుస్థిర అభివృద్ధి

» గీతంలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఫౌండర్ డాక్టర్ శివథానుపిళ్లై

సాగర్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సమాచార సాంకేతిక రంగం అంతరిక్ష ప్రయోగాలు, రక్షణ రంగ పరిశోధనల్లో సాధిస్తున్న ప్రగతి దేశ సుస్థిర అభివృద్ధికి దారితీస్తుందని ప్రఖ్యాత అంతరిక్షశాస్త్ర పరిశోధకుడు, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఫౌండర్ డాక్టర్ శివథానుపిళ్లై పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కండిషనల్ మానిటరింగ్ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎంఎస్ఐ) మంగళవారం గీతం వర్సిటీలో నిర్వహించిన డాక్టర్ వి.భుజంగరావు ఎండోమెంట్ లెక్చర్‌లో ప్రసంగించారు. అంతరిక్ష పరిశోధనల ఫలితంగా 2040 నాటికి చంద్రమండలంపై భారతీయ అంతరిక్ష స్టేషన్ నెలకొల్పడంతో పాటు 2047 నాటికి పెద్దఎత్తున వ్యోమగాములను పంపే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సౌరశక్తిని ఇంధనంగా మలచుకోవడానికి సోలార్ పవర్ జనరేటింగ్, ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశ పెట్టే పరిశోధనలు నిర్వహిస్తున్నారన్నారు. అంతరిక్ష ప్రయోగాల అంతిమ లక్ష్యం మానవాళికి మేలు చేయడమేనన్నారు. కృత్రిమ మేథ, డ్రోన్ పరిజ్ఞానం, రోబోటిక్స్ సమాజ హితానికేనన్నారు. రానున్న రోజుల్లో సూపర్ స్మార్ట్ సొసైటీల్లో సరికొత్త ఆవిష్కరణలకు యువత కేంద్ర బిందువు కానున్నదన్నారు. బ్రహ్మోస్ క్షిపణుల సామర్థ్యం ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి తెలిసిందని, దీనికి మించిన క్షిపణి ప్రపంచంలో మరొకటి లేదన్నారు. తక్కువ వ్యయంతో కూడిన సాంకేతిక పరిజ్ఞానం దేశానికి అవసరమని, రీయూజబుల్ క్రూయిస్ మిసైల్‌ల తయారీపై దృష్టి సారించాల్సి ఉందన్నారు. సీఎంఎస్ఐ అధ్యక్షుడు పీవీఎస్ గణేష్‌కుమార్ మాట్లాడుతూ ఇండస్ట్రీ 4.0లో కండిషన్ మానిటరింగ్ కీలకంగా మారిందని, కృత్రిమ మేథ, డేటా ఎనలిటిక్స్ సహకారంతో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఏరోస్పేస్ ఫౌండర్ డాక్టర్ శివథానుపిళ్లైతో పాటు కిమ్స్ ఐకాన్ చైర్మన్ డాక్టర్ వి.భుజంగరావులను గీతం వీసీ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, డాక్టర్ ఆర్.రాజేశ్వరరెడ్డి, ఎంఆర్ఎస్ సత్యనారాయణ, డాక్టర్ ప్రసాద్, ఎన్ఎస్‌టీఎల్ అధికారులు, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శివథానుపిళ్లైకు జ్ఞాపిక అందజేస్తున్న గీతం వీసీ

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో పూజారి మృతి



రమణ (ఫైల్ ఫొటో)

సింహాచలం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో అడివివరం తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవతల పూజారి లండ వెంకటరమణ (45)మృతిచెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటరమణ భార్యతో కలిసి ఆదివారం రాత్రి సింహాచలం నుంచి ద్విచక్ర వాహనంపై జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా ఆనందపురం మండలం గుడిలోవ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో రమణ తీవ్రంగా గాయపడగా, అతని భార్య స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు రమణను ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందారు. ఈ ఘటనతో అడివివరం వాసులు దిగ్భ్రాంతికి గురయ్యారు. వివిధ పార్టీల నేతలు పీవీ నరసింహం, కర్రి సత్తిబాబు, పాశర్ల ప్రసాద్, సంతాపం తెలిపారు. రమణ అడివివరం సహకార పరపతి సంఘం పాలక మండలి సభ్యుడు కావడంతో చైర్మన్ కర్రి అప్పలస్వామి సంఘానికి బుధవారం సెలవు ప్రకటించారు.

స్టీలుప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడి మృతి



రామారావు మృతదేహం

ఉక్కుటౌన్‌షిప్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు స్టీల్ మెల్ట్‌షాప్ విభాగంలో మంగళవారం ఓ కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందాడు. పెదగంట్యాడకి చెందిన పుచ్చల రామారావు (49) ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం విధులు నిర్వహిస్తుండగా వాంతులు కావడంతో ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించారు. కాగా కార్మికుడు మృతి చెందినప్పటికీ సంబంధిత కాంట్రాక్టరు పరామర్శించకపోవడం దారుణమని కార్మిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

బీరు సీసాతో దాడి..ఒకరికి గాయాలు



గాయపడిన కుమార్

సీతంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బీరు సీసాతో దాడి చేయడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన దొండపర్తి వద్ద మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తాటిచెట్లపాలెం సంజీవయ్య కాలనీకి చెందిన కండిపిల్లి కుమార్ శనివారం అర్ధరాత్రి బాబాయిని తీసుకురావడానికి దొండపర్తి వచ్చాడు. అక్కడికి ఓ ఆటో డ్రైవర్ వచ్చి ఆటో కావాలా? అని అడిగాడు. వద్దని చెప్పడంతో గీరగా చూస్తున్నావేంటి? అంటూ వాగ్వాదానికి దిగాడు. ఆటో దిగి రోడ్డుపై ఉన్న బీరు సీసాతో తలపై కొట్టి విరిగిన ముక్కతో కుమార్ ముఖంపై దాడి చేశాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆటో డ్రైవర్ ఉడాయించాడు. గాయపడిన కుమార్ అంబులెన్సులో కేజీహెచ్‌కి వెళ్లి చికిత్స చేయించుకున్నాక నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి, మంగళవారం ఆటో డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రైల్వే ఉద్యోగాల పేరిట టోకరా

పోలీసులను ఆశ్రయించిన యువకులు » నిందితుడు విశాఖ వాసి

మణుగూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి, ఒక్కొక్కరి నుంచి రూ.1200 చొప్పున సేకరించిన ప్రబుద్ధుడు యువకులను నిలువునా మోసం చేశాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి కనిపించకుండా పోవడంతో వారంతా పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటన తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.

విశాఖపట్నానికి చెందిన నరేంద్ర కుమార్‌పట్నాయక్ మణుగూరు డిగ్రీ కాలేజీలో చదువుకుంటున్న విద్యార్థులకు ఫోన్ ద్వారా పరిచయమయ్యాడు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు రైల్వేలో ఉద్యోగాలు ఉన్నాయని వారికి తెలిపాడు.. చక్కని భవిష్యత్తు ఉంటుందని నమ్మ బలికాడు. వారితో పలు సమావేశాలను నిర్వహించాడు. నిరుద్యోగ యువకులను కూడా బుట్టలో పడేసుకున్నాడు. రైల్వే శాఖలో టికెట్ కలెక్టర్ ఉద్యోగాలు పడ్డాయని పలు విభాగాల్లో ఉపాధి ఇప్పిస్తానని చెప్పడంతో 35 మంది విద్యార్థులతో పాటు మరో 75 మంది డబ్బులు చెల్లించారు. 15 రోజుల ఫోన్ సంభాషణలు, రెండు మూడు సమావేశాలను నిర్వహించిన మోసగాడు రిజిస్ట్రేషన్ పేరిట రూ.400, ఇతరత్రా ఖర్చులు కలిపి రూ.1200 వరకు ఫోన్ పేలో స్వీకరించాడు. మణుగూరులో ఆదివారం సమావేశం ఉంటుందని చెప్పి, రాకపోవడం, ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో మోసపోయామని తెలుసుకున్నారు. దీంతో మంగళవారం పోలీసులను ఆశ్రయించారు.

పారదర్శకంగా ఆర్మీ రిక్రూట్‌మెంట్

» దళారులను నమ్మి మోసపోవద్దు: విశాఖ ఆర్మీ అధికారులు

కాకినాడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5వతేదీ నుంచి 20 వరకు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని విశాఖపట్నం ఆర్మీ అధికారులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్మీలో ఉద్యోగాల కోసం దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దన్నారు. ప్రధానంగా అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ పోస్టులకు నియామకం జరుగుతుందన్నారు. 8 నుంచి పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, అనకాపల్లి, ఏలూరు, ఎన్‌టీఆర్, కాకినాడ జిల్లా, యానాం నుంచి ర్యాలీకి అడ్మిట్ కార్డులు పొందిన అభ్యర్థులు హాజరుకావాలన్నారు. మార్చి 12న ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ర్యాలీ నోటిఫికేషన్ మేరకు అన్ని ధ్రువపత్రాలను, స్మార్ట్‌ఫోన్లను తీసుకురావాలన్నారు. దళారులు, ఏజెంట్లు, మధ్యవర్తులను నమ్మవద్దని హెచ్చరించారు.

లక్ష ఉద్యోగాల కల్పనే ధ్యేయం: జేసీ

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు, లక్ష మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. వార్డు, గ్రామ సచివాలయాల్లో ఎంపిక చేసిన సిబ్బందికి సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో మంగళవారం రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతిభావంతులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నామన్నారు. వారి ద్వారా స్టార్టప్‌లపై అవగాహన ఉన్నవారికి శిక్షణ ఇస్తామన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏపీ సీఈఓ సూర్యతేజ మాట్లాడుతూ 130 మందిని ఎంపిక చేశామని, వారిలో పీహెచ్‌డీలు, మాస్టర్ డిగ్రీలు చేసిన ఉన్నారని, ఈ శిక్షణ తోడైతే అనేక ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయన్నారు.

స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్, కమిషనర్

సిరిపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్డీఏ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని వీఎంఆర్డీఏ ఉద్యోగుల కోసం వచ్చేనెలలో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న క్రీడా ఉత్సవ్(స్పోర్ట్స్ మీట్)ను విజయంతం చేయాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.విశ్వనాథన్ కోరారు. వీఎంఆర్డీఏ హాల్‌లో మంగళవారం క్రీడా ఉత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. క్రికెట్, వాలీబాల్, చెస్, క్యారమ్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, సీఈ వినయ్‌కుమార్, సీఏఓ హరిప్రసాద్, ఇంజనీర్లు బలరామరాజు, భవానీశంకర్, సుజాత, శివానీ తదితరులు పాల్గొన్నారు.